
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

శనివారం 5 జులై 2025 | 5

99 మందికి పీహెచ్‌డీ అవార్డులు

స్నాతకోత్సవ వేడుకల్లో భాగంగా 99 మంది రీసెర్చ్ స్కాలర్స్‌కు పీహెచ్‌డీ అవార్డులు, 35 మందికి బంగారు పతకాలు, ఐదుగురికి ఎండోమెంట్ అవార్డులను గవర్నర్, వీసీ ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వర్సిటీ రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఆదిత్య చైర్మన్ ఎన్.శేషారెడ్డి, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ పి.ఉదయ్‌భాస్కర్, మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు, కేవీఎస్‌జీ మురళీకృష్ణ, శ్రీనివాస్‌కుమార్, ఈసీ సభ్యులు బీవీవీ సత్యనారాయణ, అమీనాబీ, హరిత, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్య.. విజయం



అదిరే..అదిరే: స్నాతకోత్సవంలో విద్యార్థిని సాంస్కృతిక ప్రదర్శన



స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్





గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో జేఎన్‌టీయూకే వీసీ తదితరులు

నువ్వే సాధించావ్ తల్లీ..



జేఎన్‌టీయూకే విద్యార్థులకు పట్టాప్రదానం

గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న కోట సుబ్రహ్మణ్యం

- విద్యతో దేన్నయినా సాధించవచ్చు
- క్వాంటమ్ మిషన్‌తో ఉపాధి
- గవర్నర్, వర్సిటీ కులపతి అబ్దుల్ నజీర్
- జేఎన్‌టీయూకే 11వ స్నాతకోత్సవం

జేఎన్టీయూకే, జూలై4(ఆంధ్రజ్యోతి): యువత ధైర్యంగా, విభిన్నంగా ఆలోచిస్తూ సమస్యలను ఎదుర్కొని విజయం సాధించాలని రాష్ట్ర గవర్నర్, వర్సిటీ కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. కాకినాడ జేఎన్టీయూ 11వ స్నాతకోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది.వర్సిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ అధ్యక్షత వహించి అధ్యక్షోపన్యాసం చేశారు. విద్య అనేది ప్రతి ఒక్కరికీ అవసరమైందని, విద్యతో ప్రపంచంలో దేన్నయినా సాధించవచ్చన్నారు. రాష్ట్రంలో ఏర్పాటవుతున్న క్వాంటమ్ మిషన్ వల్ల 2026 నాటికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయాలు క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీ, ఏఐ, ఐవోటీ, రోబోటిక్స్, నానోటెక్నాలజీ, తాత్విక ఆలోచనలతో సాంకేతికతను ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. స్వర్ణాంధ్రప్రదేశ్-2027 విజన్ ద్వారా మన రాష్ట్రం డిజిటల్ పరిపాలన, స్టార్టప్స్, తీరప్రాంతాల ఆధునికీకరణతో ప్రపంచాన్ని తలదన్నే మౌలిక సదుపాయాల కల్పనలో దూసుకువెళుతుందని చెప్పారు.ఇక్కడే చదువుకుని..అమెరికాలోని బోస్టన్ గ్రూప్ చైర్మన్‌గా ఉన్న కోట సుబ్రహ్మణ్యం (సుబు కోట)కు గవర్నర్ అబ్దుల్ నజీర్ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. అనంతరం కోట సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ స్టార్టప్స్ కోసం ఏర్పాటయ్యే ఇంక్యుబేషన్ సెల్స్ విశిష్టతను తెలిపారు. భారతదేశంలో ప్రతీ ఏడాది 25 లక్షల మంది గ్రాడ్యుయేట్లు, 3.5 లక్షల మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు డిగ్రీ పట్టాలతో బయటకు వస్తున్నారన్నారు. చైనాతో పోలిస్తే భారత్‌లో గ్రాడ్యుయేట్లు 1.5 రెట్లు ఎక్కువని, అమెరికాతో పోలిస్తే 2 రెట్లు ఎక్కువని తెలిపారు. భారతదేశంలో విద్యా నాణ్యత ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. సీఎస్ఈలో భారత్‌లో ప్రతి ఏడాది సుమారుగా 25 మంది మాత్రమే పీహెచ్‌డీలు అందుకుంటున్నారని, అమెరికాలో ఏడాదికి 800 మంది కంటే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. జేఎన్టీయూకే ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ పరిశోధన కోసం నూతన కోణాలను అవలంబించాలని, సమాజశ్రేయస్సు కోసం పరిశోధనా ప్రాజెక్టులను చేపట్టాలని విద్యార్థులకు సూచించారు. పరిశ్రమ, విశ్వవిద్యాలయాలకు అనుసంధానంగా పాఠ్యాంశాలు, కోర్సు రూపకల్పనలతో పాటు పరిశ్రమల్లో పరిశోధనలను జాతీయ విద్యావిధానం ప్రోత్సహిస్తుందన్నారు. తర్వాత గవర్నర్ అబ్దుల్‌నజీర్‌ను వీసీ సత్కరించారు. వర్సిటీ రెక్టార్ కేవీ రమణ స్నాతకోత్సవానికి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వర్సిటీ రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, రాజ్ భవన్ అధికారులు, ఆదిత్య చైర్మన్ ఎన్.శేషారెడ్డి, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ పి.ఉదయ్‌భాస్కర్, మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు, కేవీఎస్‌జీ మురళీకృష్ణ, శ్రీనివాస్‌కుమార్, ఈసీ సభ్యులు బీవీవీ సత్యనారాయణ, అమీనాబీ, హరిత, రత్నకుమారి, డైరెక్టర్లు గోపాలకృష్ణ, బీటీకృష్ణ, కృష్ణప్రసాద్, పద్మజారాణి, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, శ్యామ్‌కుమార్, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆకాశమే హద్దు: జేఎన్‌టీయూకే స్నాతకోత్సవంలో భాగంగా పట్టాలు అందుకున్న అనంతరం విద్యార్థుల ఆనందం



కలెక్టరేట్‌లో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిషాంతి

తెలుగుజాతి పౌరుషం మన్యంవీరుడు అల్లూరి

జయంతి వేడుకల్లో నివాళులర్పించిన కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూలై4(ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ సామ్రాజ్యవాదులపై ప్రత్యక్ష సాయుధ పోరాటం సాగించి తెలుగుజాతి పౌరుషాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు అని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం సీతారామరాజు 128వ జయంతి వేడుకల్లో భాగంగా కలెక్టరేట్‌లో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి కలెక్టర్‌తోపాటు సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందలాదిమంది బ్రిటీష్ సైన్యాన్ని నేలకూల్చిన ఘనత అల్లూరిదేనని పేర్కొన్నారు. ఆయన పోరాటస్ఫూర్తిని కొనియాడారు. విప్లవజ్యోతిగా కీర్తింపబడిన అల్లూరి త్యాగనిరతిని ప్రశంసిస్తూ నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ 1922 ఆగస్టు 22న తిరుగుబాటులో తొలి దాడి ప్రారంభమైందని, ప్రధానంగా రంప అటవీ ప్రాంతంలో పలు స్టేషన్ల మీద దాడులు చేశారన్నారు. 1923లో ఉద్యమాన్ని దెబ్బతీయడానికి పోలీసులు గిరిజనులను చిత్రహింసలు పెట్టినా వారు ఉద్యమ పక్షానే నిలిచారన్నారు. బ్రిటీష్ సైన్యాన్ని ముప్పుతిప్పలు పెట్టిన మహాయోధుడు స్వర్గీయ అల్లూరి అని ఆమె ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రాజకుమారి, ఏవో కె.కాశీవిశ్వేశ్వరరావు, వికాసా జిల్లా మేనేజర్ జి.రమేష్, కలెక్టరేట్‌లోని కార్యాలయ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఇసుక కమిటీ సమావేశంలో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిషాంతి

ఇసుక అక్రమ తవ్వకాలపై విచారణ చేపట్టండి

- ఆరేళ్లుగా స్టాకు యార్డులకు తరలించిన ఏజెన్సీలపై విచారణకు ఆదేశం
- ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూలై4(ఆంధ్రజ్యోతి): గత ఆరేళ్ల నుంచి ఇప్పటివరకు ఇసుక తవ్వకాల స్టాకుల రిపోర్టులపై విచారణ నిర్వహించి ప్రభుత్వ ఒప్పందంకంటే ఎక్కువ విస్తీర్ణంలో నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ లోతు ఇసుక తవ్వకాలు చేపట్టిన ఏజెన్సీలపై క్రమశిక్షణా చర్యలకు సిఫార్సు చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఇసుక కమిటీ సభ్యులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టాలని సూచించారు. ప్రస్తుత వర్షాకాలంలో ఎంపిక చేసిన స్టాకు యార్డుల ద్వారా ఇసుక విక్రయాలు నిర్వహణ కోసం పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. స్టాకు యార్డుల వద్ద వాహనాల పార్కింగ్, వేబ్రిడ్జిలు, వాహనాల రాకపోకలకు అనువుగా రహదారుల ఏర్పాట్లను పరిశీలించి విక్రయాలు చేపట్టాలని జిల్లా రవాణాధికారి, ఆర్డీవోలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. యార్డుల వద్ద వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని సూచించారు. లోడింగ్ విషయంలో ఎటువంటి జాప్యానికి తావు ఇవ్వకుండా ఇసుకను త్వరితగతిన లారీల్లో లోడు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నదీ గర్భంలో ఎట్టి పరిస్థితుల్లోను ఇసుక తవ్వకాలు రానున్న అక్టోబరు 15 వరకు నిర్వహించరాదని కలెక్టర్ ఆంక్షలు విధించారు. ఇసుక విక్రయాలపై బృందాలు నియమించి ధరల వ్యత్యాసాలను గమనించి లోటుపాట్లను ఎప్పటికప్పుడు సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చిల్లరగా ఇసుక, కంకర విక్రయాలు నిర్వహిస్తున్న వ్యాపారులను పిలిచి వారితో ఆ ఇసుక ఎక్కడి నుంచి వస్తుందో ఆరా తీయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, గనులు, భూగర్భశాఖ ఏడీ ఎల్.వంశీధర్‌రెడ్డి, ఆర్డీవోలు కె.మాధవి, పి.శ్రీకర్, డి.అఖిల, గ్రౌండ్ వాటర్ ఏడీ ప్రత్యూష పాల్గొన్నారు.

రైల్వేలైన్, హైవే భూముల్లో ఫెన్సింగ్

కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్, నర్సాపురం బైపాస్ జాతీయ రహదారి ఏర్పాటుకు సంబంధించి ఎలైన్‌మెంట్‌లో సేకరించిన భూముల సరిహద్దుల్లో ఫెన్సింగ్ ఏర్పాటుచేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. భూముల సరిహద్దుల్లో ఫెన్సింగ్ స్తంభాలు ఏర్పాటుచేయడం వల్ల తదుపరి సమస్యలు ఉత్పన్నం కావన్నారు. రైల్వే, జాతీయ రహదారులు, ఆర్అండ్‌బీ శాఖల అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. రైల్వే లైన్ నర్సాపురం బైపాస్ రోడ్డు భూసేకరణపై శాఖల వారీ అధికారులతో సమీక్షించారు. పనుల పురోగతిపై సమీక్షించారు. జాయింట్ కలెక్టర్ నిషాంతి, ఆర్డీవోలు పి.శ్రీకర్, కె.మాధవి, డి.అఖిల, ఎన్‌హెచ్ అధికారులు టి.నిక్కీ, సూపరింటెండెంట్ ఏసుబాబు పాల్గొన్నారు.

పక్కాగా.. స్కెచ్!



ఒక సర్వేయర్ గలీజు పని!

- వ్యాపారుల మధ్య తీవ్ర పోటీ
- మైనింగ్ స్కెచ్‌ల విక్రయం
- రూ.3 లక్షలు వసూలు
- అరకోటికిపైగా గుంజుడు
- లక్షల్లో ముట్టజెబితే స్కెచ్‌లు
- మిగిలినవారికి జెల్ల
- 53 దరఖాస్తులు
- ఒక్క రౌతులపూడికే 45

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

గనులశాఖలో చిన్న తరహా ఖనిజాలు దక్కించుకునేందుకు ఉమ్మడి జిల్లాలో నెలకొన్న భారీ పోటీ ఆ సర్వేయర్‌కు లక్షల్లో కాసుల వర్షం కురిపించింది. ఫస్ట్ కం ఫస్ట్ విధానంలో ముందుగా మైనింగ్‌కు దరఖాస్తు చేసుకున్నవారికే లీజు దక్కనుండడంతో సదరు ఉద్యోగి ఇదే అదనుగా స్కెచ్‌లకు బేరం పెట్టేశాడు. దరఖాస్తుకు తోడు మైనింగ్ స్కెచ్ పక్కాగా ఉంటేనే లీజు దక్కనుండడాన్ని అసరాగా చేసుకుని భారీగా పిండేశాడు. ఉచితంగా ఇవ్వాల్సిన మైనింగ్ స్కెచ్‌లకు హెక్టారుకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేశాడు. ఇలా మూడు రోజుల వ్యవధిలో సదరు సర్వేయర్ అర కోటికిపైగానే జేబులో వేసేసుకున్నాడు.ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మైనింగ్ లీజులకు 53 దరఖాస్తులు రాగా 45 ఒక్క రౌతులపూడిలో క్వారీలకే వచ్చాయి. ఇందులో సదరు సర్వేయర్ తనకు భారీగా ముట్టజెప్పిన రెండు కంపెనీలకు 15 దరఖాస్తులు దఖలు చేయించడం విశేషం.

తొలుత వచ్చిన వారికే..

గత వైసీపీ హయాంలో కుదేలైన మైనింగ్ రంగానికి పునర్జీవం కల్పించేలా ఈ ఏప్రిల్‌లో రాష్ట్ర ప్రభుత్వం మినరల్ పాలసీ-2025 తెచ్చింది. ఖనిజ నిబంధనలు సవరిస్తూ కిందటి గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం మైనింగ్ లీజులకు ఎవరు ముందు దరఖాస్తు చేసుకుంటే వారికే గనులు కేటాయించేలా ప్రభుత్వం నిర్ణయించింది. ఫస్ట్ కం ఫస్ట్ అప్లికేషన్ విధానం అమల్లోకి తెచ్చింది.ఈ నేపథ్యంలో గత నెల 30 నుంచి ఈ నెల 12 తేదీల్లో అనేక మంది మైనింగ్ వ్యాపారులు క్వారీల్లో నల్లరాయికి పోటీ పడ్డారు. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోటీ తీవ్రంగా నెలకొంది. మైనింగ్ స్కెచ్ పక్కాగా ఉంటేనే లీజు మంజూరవు తుంది. గనులశాఖ ఈ స్కెచ్‌లను దరఖాస్తుదారులకు ఉచితంగా ఇవ్వాలి.ఎందు కంటే లీజుదారుడు దరఖాస్తు సమయంలోనే హెక్టారు మైనింగ్ తవ్వకానికి రూ.80 వేలు చొప్పున చెల్లిస్తాడు.రూ.5 వేలు సర్వే ఫీజు కట్టాలి.

రౌతులపూడికే డిమాండ్..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 53 మైనింగ్ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో రాగా ఇందులో 45 దరఖాస్తులు ఒక్క రౌతులపూడిలోని నల్లరాతి క్వారీలకే దాఖలయ్యాయి. మిగిలినవి పెద్దాపురం గ్రావెల్, జెడ్.అన్నవరం, వాలుతిమ్మాపురం ప్రాంతాలకు దాఖలయ్యాయి. రౌతులపూడిలోని వందల హెక్టార్లలో క్వారీలకు 45 దరఖాస్తులు పడ్డాయి.

పక్కాగా స్కెచ్‌వేసి కొట్టేశాడు..

ఉమ్మడి జిల్లాలో కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోని గనుల శాఖ కార్యాలయాల్లో సర్వేయర్ల వద్ద మైనింగ్ స్కెచ్‌లు అందుబాటులో ఉంటాయి. లీజుదారులు వీటిని దక్కించు కునేందుకు ప్రయత్నించారు. అయితే ఖనిజ నిబంధనలు విడుదలవడానికి కొన్ని రోజుల ముందే తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గనుల శాఖ సర్వేయర్ వీటిపై కన్నేశాడు. ఈయన పదిహేనేళ్ల నుంచీ ఇక్కడే పాతుకు పోయాడు. కాకినాడ సర్వేయరేమో జూనియర్. కాకినాడ కార్యాలయంలో ఉన్న స్కెచ్‌లన్నీ అవసరం పేరుతో సదరు రాజమహేంద్రవరం గనులశాఖ సర్వేయర్ ముందే రప్పించేశాడు. గనులశాఖ అనుమతించిన ప్రైవేటు సర్వేయర్ల వద్ద స్కెచ్‌లను పరిశీలన పేరుతో ముందుగానే రప్పించుకున్నాడు.ఆ తర్వాత ఇక్కడి నుంచే కథ నడిపాడు. స్కెచ్‌లను హెక్టారుకు రూ.3 లక్షల వరకు సదరు సర్వేయర్ విక్రయించాడు. కొందరు వ్యాపారులు 5, 10, 15 హెక్టార్లకు అప్లికేషన్లు దాఖలు చేయగా ఈ పెద్ద స్కెచ్‌లకు రూ.10 లక్షల వరకు డబ్బులు గుంజేశాడు. రౌతులపూడి క్వారీలకు డిమాండ్ ఉండడంతో సుమారు 60 క్వారీల స్కెచ్‌లు తన వద్దే ఉంచుకున్నాడు. స్కెచ్ ఉన్న దరఖాస్తుదారుడికి లీజు అవకాశాలు పుష్కలంగా ఉండడంతో అనేక మంది వ్యాపారులు వీటిని సదరు సర్వేయర్ వద్ద కొనుగోలు చేశారు.రవి అనే వ్యాపారి సత్య ఇంజనీరింగ్ పేరుతో పలు పేర్లు మార్చి ఏడు దరఖాస్తులు దాఖలు చేశారు.ఈ మైనింగ్ ప్రాంతం స్కెచ్‌లన్నీ ఈయన ముందే కొనేశాడు. సదరు సర్వేయర్ అడ్డంగా సహకరించాడు. రౌతులపూడి క్వారీకి సంబంధించి దాదాపు 28 మంది వ్యాపారులు లక్షలకు లక్షలు సర్వేయరుకు ముట్టజెప్పారు. మెట్ట ప్రాంతానికి చెందిన ఓ కాంట్రాక్టర్ కంపెనీ ఆరు దరఖాస్తులు చేయగా స్కెచ్‌లకు భారీగా ముట్టజెప్పింది. సదరు ఉద్యోగి మూడు రోజుల వ్యవధిలో అర కోటిపైనే జేబు నింపేసుకున్నాడు. కాకినాడ సర్వేయర్ జూనియర్ కావడం రాజమహేంద్రవరం ఏడీ కార్యాలయ సర్వేయర్‌కు బాగా కలిసొచ్చింది.

ఇక్కడా వైసీపీ నేతలే..!

అప్లికేషన్ ఆన్‌లైన్‌లో దాఖలు చేయడానికి సమయం పట్టడం, కొత్త వ్యాపారులకు అవగాహన లేకపోవడంతో సదరు సర్వేయర్ ఏకంగా ఎనిమిది మందిని పురమాయించి రాజమహేంద్రవరంలో ఓ అపార్ట్‌మెంట్ నుంచి వంద హెక్టార్ల మైనింగ్ కోసం వ్యాపారుల తరపున 15 లీజు దరఖాస్తులు చేయించారు.కాకినాడ గనుల శాఖలో అవుట్‌సోర్సింగ్ మాజీ మహిళా ఉద్యోగి సైతం కొందరు వ్యాపారుల తరపున దరఖాస్తులు దాఖలు చేశారు.ఇదిలా ఉంటే వచ్చిన దరఖాస్తులను సోమవారం నుంచి పరిశీలించి ఎవరు ముందుగా లీజులకు దరఖాస్తు చేశారు? స్కెచ్‌లు ఎవరివి పక్కాగా ఉన్నాయో నిర్ధారించి లీజులు ఖరారు చేయనున్నారు.దరఖాస్తుల్లో అనేక మంది వైసీపీ వ్యాపారులు ఉండడంతో లీజుల కోసం వీరు సైతం చక్రం తిప్పుతున్నారు.



అమల్లోకి మైనింగ్ కొత్త పాలసీ

14 వరకు సీనరేజి కాంట్రాక్టు గడువు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం మైనర్ మినరల్ పాలసీ, ఇసుక ఉచిత విధానంతో కొత్త మైనింగ్ పాలసీని అమల్లోకి తెచ్చింది. ఈ మేరకు గత నెల 26వ తేదీనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గెజిట్‌లో నోటిఫికేషన్ విడుదల చేశారు. దీంతో జిల్లాలో చాలా కాలం తర్వాత మైనింగ్ సందడి మొదలైంది. మాన్యువల్‌గానే ఇసుక తీయాలని కొత్త పాలసీలో ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం డీసిల్టేషన్‌కే అనుమతి ఉందని.. ఓపెన్ రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. గత వైసీపీ పాలనలో మైనింగ్ విధానం ధ్వంసమైన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఏప్రిల్ 29న కొత్తపాలసీపై ప్రభుత్వం ఓ సర్క్యులర్ జారీ చేసిన సంగతి తెలిసిందే. దానిని అధికారికంగా అమల్లోకి తెచ్చారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బిల్డింగ్,రోడ్ మెటల్, గ్రా నైట్,గ్రావెల్, లేటరైట్ గనులు ఉన్నాయి. అప్పట్లో 250 లీజు దరఖాస్తులను వైసీపీ పెండింగ్‌లో పెట్టింది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వాటిని పరిశీలించి అర్హులకు లీజు ఇవ్వనుంది. కొత్త దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ముందు పాతవి క్లియర్ చేయనున్నారు. ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ) ప్రకారం 2023 మార్చి 13 నాటికి ఫైలైన పెండింగ్ మినరల్ కన్సెషన్ దరఖాస్తులు పరిశీలించి పరిష్కరించనున్నారు. అర్హత ఉంటే ఆమోదం తెలిపి డిపాజిట్ కట్టించుకుంటారు.గ్రానైట్, మార్బుల్, బిల్డింగ్ మెటీరియల్‌కు తాజాగా దరఖాస్తు చేసుకోవాలి. ఇండస్ట్రియల్ మినరల్ కోసం వేలం పద్ధతి ఉంటుంది. దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లో జరుగుతాయి. రోడ్ మెటల్ హెక్టారుకు రూ.80 వేలు, గ్రావెల్‌కు రూ. 65 వేలు, గ్రానైట్‌కు రూ. లక్షా 85 వేల వరకూ డిపాజిట్ చేయవలసి ఉంది.

14 వరకూ సీనరేజి కాంట్రాక్టు

సీనరేజి కాంట్రాక్టు గడువు ఈ నెల 14వ తేదీ తేదీ వరకూ ఉంది. గతంలో మైనింగ్ అధికారులే సీనరేజి వసూలు చేసేవారు.కానీ వైసీపీ ప్రైవేట్ కాం ట్రాక్టరుతో ముందుగానే డిపాజిట్ కట్టించు కుని సీనరేజీ వసూళ్లను అప్పగించింది.ఇది చాలా మందికి ఇబ్బంది కరంగా మారింది.మరి ప్రభుత్వం ఈ నెల 14వ తేదీ తర్వాత ఏం చేస్తుందో చూడాలి.



ప్రకృతి వైపరీత్యాలపై సమీక్షా సమావేశంలో కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిషాంతి

ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధంకండి!

వివిధ శాఖల అధికారులతో కలెక్టర్, జేసీల సమీక్ష

అమలాపురం, జూలై4(ఆంధ్రజ్యోతి): తుఫాన్లు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు రెవెన్యూ లైన్ డిపార్టుమెంట్లఅధికారులు సమన్వయంతో సన్నద్ధం కావాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ నిషాంతితో కలిసి ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులను ఎదుర్కొనేందుకు అవసరమైన ప్రణాళికలపై రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. వివిధ అంశాలపై ఆర్డీవోలు కె.మాధవి, డి.అఖిల, పి.శ్రీకర్‌లతోపాటు తహశీల్దార్‌లు పాల్గొని పలు అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌కి సంబంధించి చేపట్టాల్సిన సహాయక చర్యలు, విధి విధానాలపై గత మూడు నెలలుగా శ్రమించి మార్గదర్శకాలు రూపొందించడం జరిగిందని తెలిపారు. రెవెన్యూ అధికారులు మండలాల వారీ ప్రణాళికలను ఈ నెల 8వ తేదీ నాటికి సిద్ధం చేయాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. తుఫాను షెల్టర్లు, పునరావాస కేంద్రాలను పరిశీలించి వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరా ఏర్పాట్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను జేసీ నిషాంతి వివరించారు. సివిల్ సప్లయిస్ శాఖ ద్వారా మూడు నెలలకు సరిపడా నిల్వలు సిద్ధంచేయాలని, మత్స్యశాఖ ద్వారా పడవలు, గజ ఈతగాళ్లను నియమించాలని సూచించారు. డీఆర్వో రాజకుమారి పాల్గొన్నారు.

సీఎంకు అందిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించండి : జేసీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజలకు సుపరిపాలన అందించే వేదికగా అమలు చేస్తున్న ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని పారదర్శకంగా అమలుచేసేందుకు పలు సంస్కరణలు చేపడుతున్నట్టు జాయింట్ కలెక్టర్ నిషాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లాస్థాయి అధికారులతో పీజీఆర్ఎస్, సీఎం చంద్రబాబు పర్యటనలో అందిన ఫిర్యాదుల హామీల పరిష్కార స్థితిగతులపై సమీక్షించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నందున కిందిస్థాయి అధికారులతో పరిష్కార సరళిపై సంప్రదింపులు జరపాలన్నారు.

కనుల పండువగా స్నాతకోత్సవం

కాకినాడ నగరంలో ఉన్న జేఎన్‌టీయూకే 11వ స్నాతకోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు రాష్ట్ర గవర్నర్, వర్సిటీ కులపతి ఎస్ అబ్దుల్ నజీర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఇదే కళాశాల పూర్వపు విద్యార్థి, అమెరికాలోని బోస్టన్ గ్రూప్ చైర్మన్ కోట సుబ్రహ్మణ్యానికి గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. అలాగే 99 మంది రీసెర్చ్ స్కాలర్స్‌కు పీహెచ్‌డీ అవార్డులు, 35 మందికి బంగారు పతకాలు, ఐదుగురికి ఎండోమెంట్ అవార్డులను అందజేశారు. గంటకుపైగా సాగిన ఈ కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది.









కాకినాడలో శుక్రవారం జరిగిన జేఎన్‌టీయూకే స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి బంగారు (పసుపు) పతకాలు, పీహెచ్‌డీ పట్టాలు (తెలుపు గౌను) అందుకుంటున్న దృశ్యం

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

స్నాతకోత్సవం సందర్భంగా జేఎన్‌టీయూకే లోని అలూమ్నీ ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. క్యాంపస్ కళాశాలలోని విద్యార్థులు నిర్వహించిన పలు సంప్రదాయాలకు చెందిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

జేఎన్‌టీయూకే స్నాతకోత్సవంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం







ఈ విజయం అమ్మలది కూడా..





బంగారు పతకాలు పొందిన తర్వాత తమ తల్లులతో ఆనందాన్ని పంచుకుంటున్న విద్యార్థినులు.. తన తల్లితో ఓ విద్యార్థి



స్నాతకోత్సవంలో కులపతి నజీర్‌కు జ్ఞాపిక అందిస్తున్న వర్సిటీ ఉపకులపతి సీఎస్ఆర్‌కే ప్రసాద్

పీహెచ్‌డీలు, బంగారు పతకాలు ప్రదానం

జేఎన్టీయూకే, జూలై 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ 11వ స్నాతకోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కొందరు పీహెచ్‌డీలు, బంగారుపతకాలు అందుకున్నారు. వారిలో కొందరి అభిప్రాయాలు ఇలా ఉన్నాయి....

● బంగారు పతకాలు



మార్కులకోసం చదవకూడదు

విద్యార్థులు మార్కులకోసం కాకుండా సబ్జెక్టుపరంగా చదివితే విజయం సాధించవచ్చు. సీఎస్ఈలో బంగారు పతకం సాధించడం చాలా సంతోషంగా ఉంది. సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించడమే నా లక్ష్యం.

- కలిశెట్టి పావని, బంగారుపతకం



స్టార్టప్ ప్రారంభించడమే లక్ష్యం

సీఎస్ఈ ఏఐలో టాపర్‌గా నిలిచి బంగారుపతకం సాధించాను. స్టార్టప్ కంపెనీ ప్రారంభించి ఉన్నత స్థానంలోకి చేరుకోవడమే నా లక్ష్యం.

- షేక్ సులేమాన్, బంగారు పతకం



ఎంటర్‌ప్రెన్యూర్ కావడమే నా కోరిక

వర్సిటీ అనుబంధ కళాశాలల పరిధిలో 9.08 సీజీపీఏ పాయింట్లతో సీఎస్ఈ (ఎంఈ)లో టాపర్‌గా నిలిచి, అల్లం అప్పారావు బంగారు పతకాన్ని, సీఎస్ఈలో టాపర్‌గానూ మొత్తం 3 పతకాలు సాధించాను. ప్రస్తుతం శాప్‌లో పనిచేస్తున్నాను.

- జె.విశాలసుబ్బలక్ష్మి, బంగారు పతకం

● పీహెచ్‌డీ అవార్డులు



ఈసీఈలో పరిశోధన

అక్యులర్ ఆర్టిఫిక్స్‌లో పరిశోధన చేశాను. ఈఈజీలో అవాంతరాలు ఏర్పడినప్పుడు ఎంఎల్ ఆల్గోరిధం ద్వారా ఏవిధంగా వాటిని నియంత్రించవచ్చో కనుగొన్నాను.

- డి.శ్యామ్‌ప్రసాద్, పీహెచ్‌డీ



నూతనమందులను కనుగొనవచ్చు

బయోఇన్ఫర్మేటిక్స్‌లో ప్రొటీన్ నిర్మాణం, ప్రెడిక్షన్ ద్వారా నూతన మందులను కనుగొనే విధానాన్ని కనిపెట్టాను. దీంతో నూతన పద్ధతిలో మందులను కనుగొనవచ్చు.

- డాక్టర్ టి.సుధారాణి, పీహెచ్‌డీ



డేటా పొందాలంటే అనుమతి తప్పనిసరి


క్లౌడ్ కంప్యూటింగ్ సెక్యూరిటీలో ఉన్న డేటాను పొందాలంటే దానిని క్రియేట్ చేసిన వ్యక్తినుంచి తప్పనిసరిగా అనుమతి పొందాలి. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నాను.

- ఈ.రవికుమార్, పీహెచ్‌డీ

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

రెండో షెడ్యూల్‌లో ఎన్సీ 24




నాగచైతన్య కథానాయకుడిగా కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ చిత్రం (ఎన్సీ-24- వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోంది. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. శుక్రవారం హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్‌ను ప్రారంభించినట్లు యూనిట్ తెలిపింది. నెలరోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో నాగచైతన్యతో పాటు ప్రధాన తారాగణం అంతా పాల్గొంటోంది. ఈ సందర్భంగా యూనిట్ నాగచైతన్య పోస్టర్‌ను విడుదల చేసింది. ఒక చేతిలో గొడ్డలి, మరో చేతిలో తాడుతో మాస్ లుక్‌లో నాగచైతన్య ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రఘుల్ ధరుమాన్

వైరల్ వయ్యారి



గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా పరిచయమవుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వంలో వారాహి చలనచిత్రం బేనర్‌పై రజనీ కొర్రపాటి నిర్మించారు. శ్రీలీల కథానాయిక. ఈ నెల 18న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'జూనియర్' నుంచి రెండో పాటను యూనిట్ శుక్రవారం విడుదల చేసింది. 'వైరల్ వయ్యారి' అంటూ సాగే ఈ గీతానికి కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. దేవి శ్రీ ప్రసాద్ స్వరాలందించడంతో పాటు హరిప్రియతో కలసి ఆలపించారు. దేవి సంగీతంతో పాటు కిరీటి రెడ్డి, శ్రీలీల స్టెప్పులు ఈ పాటకు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కె. కె. సెంథిల్ కుమార్

పల్లెటూరి సరదాలు



మనోజ్ చంద్ర, మోనిక టి, ఉషా బోసెల ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న గ్రామీణ నేపథ్య వినోదాత్మక చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నటి, నిర్మాత ప్రవీణ పరుచూరి ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. రానా దగ్గుబాటి సమర్పణలో గోపాల కృష్ణ పరుచూరి, ప్రవీణ పరుచూరి నిర్మిస్తున్నారు. ఈనెల 18న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. మనోజ్ చంద్ర రికార్డ్ డ్యాన్స్ స్టూడియోని నడుపుతున్న యువకుడిగా కనిపించాడు. పల్లెటూరి జీవితాన్ని, సరదాలని అద్భుతంగా ఈ చిత్రంలో చూపించబోతున్నామని చిత్రబృందం పేర్కొంది.

జెన్కో జోరు.. రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి

- మార్కెట్లో కొనకుండానే కరెంటు సరఫరా
- అందుబాటులోకి శ్రీశైలం జలవిద్యుత్
- మొత్తం 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి
- డిమాండ్‌కు సరిపడా అందడంతో.. బయట కొనుగోలు చేయని డిస్కంలు

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనుగోళ్లకు వెళ్లకుండానే.. డిమాండ్‌కు సరిపడా కరెంటును ఏపీ జెన్‌కో ఉత్పత్తి చేస్తోంది. శుక్రవారం రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసింది. రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థలు అందించిన సమాచారం మేరకు.. శుక్రవారం 199.498 మిలియన్ యూనిట్లను అవి ఉత్పత్తి చేశాయి. దీంతో.. మార్కెట్లో ఒక్క యూనిట్‌ను కూడా కొనుగోలు చేయకుండా డిస్కంలు డిమాండ్‌ను తట్టుకున్నాయి. శుక్రవారం ఏపీ జెన్కో ఆధ్వర్యంలోని థర్మల్ విద్యుత్కేంద్రాల్లో 78.015 మిలియన్ యూనిట్లు, జలవిద్యుత్కేంద్రాల్లో 19.869 మిలియన్ యూనిట్లు, జెన్కో సోలార్ కేంద్రాల్లో 1.588 మిలియన్ యూనిట్లు, సెంట్రల్ జనరేటింగ్ స్టేషన్ల 10.938 మిలియన్ యూనిట్లు, ఐపీపీ (సెయిల్, హెచ్‌ఎన్‌పీసీఎల్) 37.945 మిలియన్ యూనిట్లు, పవన విద్యుత్ 57.946 మిలియన్ యూనిట్లు, ప్రైవేటు సోలార్ 18.383 మిలియన్ యూనిట్లు, అంతర్రాష్ట్ర ఉత్పత్తి 1.206 మిలియన్ యూనిట్లు.. మొత్తం 199.498 మిలియన్ యూనిట్లను విద్యుత్ సంస్థలు అందించాయి. డిమాండ్ కూడా అంతే ఉండడంతో డిస్కంలు మార్కెట్లో కొనుగోలు చేయలేదు. శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్కేంద్రంలో ఉత్పత్తి కొనసాగుతోంది. 720 మెగావాట్లు అందుబాటులోకి వచ్చింది. కృష్ణపట్నం థర్మల్ మూడో యూనిట్ నుంచి 750 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయింది. వీటితో కలిపి 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ఇంకోవైపు.. థర్మల్ విద్యుదుత్పత్తి బాగానే ఉన్నందున ప్లాంట్లలో బొగ్గు నిల్వలను ఇంకా పెంచాలని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. వీటీపీఎస్‌లో రోజుకు 41,500 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కాగా.. 13 రోజులకు సరిపడా 5,48,586 టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఆర్‌టీపీపీలో రోజుకు 28,500 టన్నులు అవసరం కాగా.. రెండున్నర రోజులకు సరిపడా 74,549 టన్నుల నిల్వలే ఉన్నాయి. కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్‌లో రోజుకు 29,000 టన్నుల బొగ్గు అవసరం కాగా.. భారీగా 2,30,020 టన్నుల నిల్వలు ఉన్నాయి. సెయిల్‌లో రోజుకు 20,000 మెట్రిక్ టన్నుల బొగ్గుకు గాను 4,72,705 టన్నుల నిల్వలు ఉన్నాయి.

బకాయిలతో డిస్కంలు విలవిల..

రూ.7,562.48 కోట్ల బకాయిలు రాష్ట్ర డిస్కంలను భయపెడుతున్నాయి. నెలలోపే విద్యుత్ బకాయిలను తీర్చాలన్న నిబంధనలను దాటిన మొత్తాలు రూ.3,513.34 కోట్లు ఉన్నాయి. ఈ నెలలో చెల్లించాల్సిన బకాయిలు రూ.4,049.14 కోట్లు. ఈ మొత్తాలను తీర్చడానికి నిధుల కోసం డిస్కంలు అన్వేషణ ప్రారంభించాయి. అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు చేయడానికి సిద్ధమవుతున్నాయి.

ఇక 'స్మార్ట్' రేషన్ కార్డులు

- ఏటీఎం కార్డుల్లా రూపకల్పన
- క్యూఆర్ కోడ్‌తో వివరాలు ప్రత్యక్షం
- పాత కార్డుల స్థానంలో కొత్త కార్డులు
- నేతల ఫొటోలు లేకుండా ముద్రణ
- ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారు ఫొటో ఉండేలా చర్యలు
- సిద్ధమవుతున్న కొత్త స్మార్ట్ కార్డులు
- వచ్చే నెలలో పంపిణీకి ఏర్పాట్లు



అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ కార్డుల రూపుమారుతోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం కార్డులకు పార్టీ రంగులు పులిమేసి.. వాటిపై ఒకవైపు జగన్ బొమ్మ, మరోవైపు వైఎస్ రాజశేఖరరెడ్డి బొమ్మను ముద్రించి పంపిణీ చేసింది. ఇప్పుడు వాటికి స్వస్తి చెప్పి.. రాజకీయ పార్టీల రంగులు లేకుండా, నేతల బొమ్మలు ముద్రించకుండా కొత్త కార్డులను రూపొందిస్తున్నారు. పాత వాటి స్థానంలో ఈ కొత్త కార్డులు జారీ చేయడంతో పాటు ఇకపై కొత్తగా మంజూరు చేసే కార్డులన్నీ కూడా స్మార్ట్ కార్డులుగానే ఉండనున్నాయి. బ్యాంకు ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో ఈ స్మార్ట్ రేషన్ కార్డును రూపొందిస్తున్నారు. ఈ కార్డుల జారీకి పౌరసరఫరాల శాఖ ఇప్పటికే కసరత్తును పూర్తి చేసింది. స్మార్ట్ రేషన్ కార్డుపై ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, మరోవైపు కార్డుదారు (కుటుంబ పెద్ద) ఫోటో ఉంటాయి. ఆ రేషన్ కార్డు నంబరు, రేషన్‌షాపు నంబరు తదితర వివరాలుంటాయి. కార్డు వెనుకవైపు లబ్ధిదారు కుటుంబ సభ్యుల వివరాలుంటాయి. ఈ స్మార్ట్ రేషన్ కార్డును రేషన్ డీలర్ల వద్ద ఉండే ఈ-పోస్ యంత్రాల సహాయంతో స్కాన్ చేస్తే ఆ కుటుంబానికి సంబంధించిన వివరాలతో పాటు రేషన్ సరుకుల వినియోగానికి సంబంధించిన పూర్తి సమాచారం ప్రత్యక్షమవుతుంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే ఈ కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రణ కోసం ఏపీటీఎస్ ద్వారా టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. ప్రస్తుతం ముద్రణ దశలో ఉన్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను వచ్చే నెలలో పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

2 లక్షల కుటుంబాలకు కొత్తగా లబ్ధి

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1.46 కోట్లకుపైగా కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. వైసీపీ హయాంలో అర్హతలున్న నవదంపతులు, పేదలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో లక్షల సంఖ్యలో దరఖాస్తులు మూలనపడి ఉన్నాయి. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో అర్హులైనవారందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. దీంతోపాటు తల్లిదండ్రుల నుంచి వేరుపడిన వారికి స్ప్లిట్ కార్డులు, ఉన్న రేషన్ కార్డులలో సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పులకు అవకాశం కల్పిస్తూ గత మే నెలలో దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. దీంతో ప్రతి జిల్లా నుంచి లక్షలాదిగా వచ్చిపడిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం 1,47,187 మంది దరఖాస్తులు చేసుకోగా.. వారిలో 89,864 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 38,046 మంది దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. కుటుంబ విభజన (స్ప్లిట్) కార్డుల కోసం 1,43,745 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 1,09,787 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 20,403 దరఖాస్తులను తిరస్కరించారు. ఇలా కొత్తగా మంజూరు చేసిన దాదాపు 2 లక్షల కొత్త రేషన్ కార్డులలోని లబ్ధిదారులకు సెప్టెంబరు నెల నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేసే అవకాశం ఉంది. కొత్తగా వచ్చిన కార్డులతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.48 కోట్లకు చేరింది.

అన్నవరం ప్రసాదం..
ఆషాఢంలో అదరహో

- ఒక్కనెలలోనే సుమారు 10 లక్షల ప్యాకెట్ల అమ్మకాలు
- అదనపు కౌంటర్లు, సిబ్బందికి ప్రత్యేక విధులు
- ఇప్పటికే సమకూరిన రూ.50లక్షల ఆదాయం

అన్నవరం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి ప్రసాదం అంటే ఆకు కూడా వదలకుండా నాకేస్తారు. అంతటి అమృతమైన స్వామివారి ప్రసాదం అద్భుతమైన విక్రయాలు ఆషాఢమాసంలో జరుగుతాయి. సహజంగా ఆషాఢం శూన్య మాసం కావడంతో భక్తుల సంఖ్య అతి తక్కువగా ఉంటు ంది. అయితే ఆషాఢమాసంలో సత్యదేవుడి ప్రసాదానికి అధిక డిమాండ్ నెలకుని భారీ ఎత్తున అమ్మకా లుంటాయి. ఒక్క ఆషాఢంలోనే సుమారు రూ.10లక్షల ప్యాకెట్ల విక్రయాలు జరుగుతాయని అధికారుల అంచనా. ఆషాఢమాసంలో తలుపులమ్మ లోవ దేవస్థానానికి భక్తులు అధికంగా తరలివెళుతుంటారు. తిరుగు ప్రయాణంలో వారంతా సత్యదేవుడి స్వామివారి ప్రసాదాలను కొనుగోలు చేసుకుని తమ స్వస్థలాలకు వెళ్లి బంధుమిత్రులకు పంచుతుంటారు. ఆషాఢమాసంలో కేవలం ప్రసాదాల విక్రయాల ద్వారా స్వామివారి ఖజానాకు రూ.2 కోట్లమేర ఆదా యం వస్తుంది. ఈ ప్రసాదం విక్రయాలు ఆది వారం, మంగళవారం, గురువారాల్లో మాత్రమే అధికంగా ఉంటాయి. వీటి కోసం దేవస్థానం యంత్రాంగం అన్న వరం జాతీయ రహదారిపై ఉన్న రెండు నమూనాలయాలు, తొలిపావంచా వద్ద అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయడమే కాకుండా సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయిస్తుంటారు. ఆషాఢం వారంలో మూడు రోజులు ప్రసాదం తయారు చేసే వంటస్వాములు, ప్యాకింగ్ సిబ్బంది కష్టపడుతుంటూనే ఉంటారు. ప్రసాదం తయారీకేంద్రంలో నిరంతర పర్యవేక్షణతో అమ్మకాల సమయంలో ఎక్కడా లేదు అనకుండా కౌంటర్ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ సిబ్బంది శ్రమిస్తుంటారు. శుచి, రుచితో కూడిన ప్రసాదం అందించడమే లక్ష్యమని ఈవో సుబ్బారావు పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఆషాఢ మాసంలో ఇప్పటివరకు 2 లక్షల 50వేల ప్యాకెట్లు విక్రయాలు జరగగా రూ.50లక్షల ఆదాయం లభించినట్టు ఆలయ అధికారులు తెలిపారు.


సత్యదేవుడి ప్రసాదం


అమ్మకాలకు కౌంటర్లో సిద్ధంగా ఉన్న ప్రసాదం ప్యాకెట్లు

నేడు జాతీయ లోక్ అదాలత్

రాజమహేంద్రవరం, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత తెలిపారు. ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారం కావడానికి వీలుగా ముందస్తుగా కసరత్తు చేయడం జరిగిందన్నారు. రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, కుటుంబ వివాదాలు, చెక్ బౌన్స్, ప్రమాదాలు, బ్యాంకు సంబంధిత, ప్రీలి టిగేషన్ తదితర కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రేపు అంతర్ జిల్లా ఈత పోటీలకు ఎంపికలు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 4 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా 10వ సబ్ జూనియర్స్, సీనియర్స్ ఈత పోటీలకు కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలోని స్విమ్మింగ్ పూల్‌లో ఆదివారం ఎంపికలు జరుగుతాయని కాకినాడ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి సతీష్, ముఖ్య సలహాదారు మంగా వెంకట శివరామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19, 20 తేదీల్లో ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగే పోటీలకు 2008 నుంచి 2014 మధ్య పుట్టిన వారితో బాల, బాలికల జిల్లా జట్లు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు ఉదయం 9 గంటలకు వయస్సు ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని అసోసియేషన్ కార్యదర్శి ఇరుసుమళ్ల రాజు కోరారు. వివరాలకు 9246690466లో సంప్రదించాలన్నారు.

మోటార్‌సైకిల్ ఢీకొని ఇద్దరికి గాయాలు

అమలాపురం రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా జాతీయ రహదారిపై పేరూరు శివారు తోట్లపాలెం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. మలికిపురం మండలం లక్కవరం గ్రామానికి చెందిన అరిగెల నాగేశ్వరరావు, రుద్రరాజు పాండురంగరాజు మోటారు సైకిల్‌పై అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బంధువులను పరామర్శించేందుకు బయలుదేరారు. బోడసకుర్రు బ్రిడ్జి దాటిన తరువాత తోట్లపాలెం వద్దకు వచ్చేసరికి ఎదురుగా ఎన్‌ఫీల్డ్ మోటారుసైకిల్ వేగంగా వచ్చి వారి వాహనాన్ని ఢీకొంది. నాగేశ్వరరావు తీవ్రంగా గాయపడగా పాండురంగరాజు స్వల్ప గాయాలపాలయ్యాడు. వారిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ వీరబాబు తెలిపారు.

గొల్లప్రోలు బైపాస్‌రోడ్డులో ఘర్షణ
ఒకరికి కత్తిపోట్లు

గొల్లప్రోలు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు బైపాస్‌లో 216వ జాతీయరహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన ఘర్షణలో వ్యక్తి కత్తిపోట్లుకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. బైపాస్ నుంచి తాటిపర్తి రోడ్డులోకి వెళ్లే పాయింట్ వద్ద అనిశెట్టి వంశీకి, జ్యోతుల రాము, ఊటా ఇంద్ర, మరో వ్యక్తికి వివాదం జరిగింది. ఇది తీవ్ర రూపం దాల్చి ఘర్షణకు దారితీయడంతో వంశీని కత్తితో పొడిచారు. తీవ్రంగా గాయపడిన అతడిని పిఠాపురంలోని ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. నిందితులపై గతంలో చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో కేసులు ఉన్నట్టు సమాచారం. పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ ఆసుపత్రిలో కత్తిపోట్లుకు గురైన వ్యక్తిని పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.


కత్తిపోట్లుకు గురైన వంశీతో మాట్లాడుతున్న పోలీసులు

చెడు వ్యసనాలకు బానిసలై..
ఇళ్ల వద్ద పార్కింగ్ బైక్‌ల చోరీలు

గోకవరంలో 14 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్ట్

16 బైక్‌లు స్వాధీనం

గోకవరం, జూలై 4(ఆంధ్రజ్యోతి): మోటారు సైకిళ్లపై గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు నార్త్‌జోన్ డీఎస్పీ వైశ్రీకాంత్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. గోకవరం గ్రామ శివారు బాపనమ్మ తల్లి గుడి వద్ద ఎస్ఐ పవన్‌కుమార్ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో 2 మోటారుసైకిళ్లపై ముగ్గురు 2 గోనె సంచులతో అనుమానాస్పదంగా కనిపించారు. వారి వద్ద సంచులను పరిశీలించగా గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గోకవరం మండలం కామరాజుపేట గ్రామానికి చెందిన పాసం కొండలరావు, వాకాడ పవన్‌కుమార్, కాకర్ల వెంకటకుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా బైక్‌ల దొంగతనాలు బయట పడ్డాయన్నారు. పట్టుబడిన ముగ్గురు తూర్పుగోదావరి, కాకినాడ, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఒడిస్సా ప్రాంతాల్లో ఇళ్ల వద్ద పార్కింగ్ చేసిన మోటారుసైకిళ్లను దొంగిలించి కామరాజుపేట శివారున ఉన్న ఫారెస్ట్ చెక్‌పోస్టు సమీపంలోని పైపులైన్ వద్ద దాచేవారు. వాటిని గోకవరానికి చెందిన ఆవుల వంశీ ఏజెన్సీ ప్రాంతాలకు తీసుకెళ్లి అక్కడ గంజాయికి మారుబేరం చేస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. ప్రస్తుతం వంశీ పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి 14 కిలోల గంజాయి, దొంగిలించిన 14 మోటారుసైకిళ్ళు, గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన రెండు మోటా రుసైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ముగ్గురు వ్యక్తులు చెడు వ్యసనాలకు బానిసలై అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు డీఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో కోరుకొండ సీఐ వై. సత్యకిషోర్ సిబ్బంది పాల్గొన్నారు.


పట్టుబడిన నిందితులతో పోలీసులు, స్వాధీనం చేసుకున్న బైక్‌లు



విద్యుత్ శాఖ నిర్లక్ష్యం...
మెయిన్ వైర్ తగిలి బాలిక మృతి

కొవ్వూరు మండలం ధర్మవరంలో సంఘటన

ఆసుపత్రి ఎదుట గ్రామస్తుల ఆందోళన

కొవ్వూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం కారణంగా బాలిక మృతిచెందిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం ధర్మవరంలో జరిగింది. వివరాల ప్రకారం.. ధర్మవరం కొత్తపేట జగ్జీవన్‌రావు విగ్రహం సమీపంలో నివాసం ఉంటున్న జొన్నకూటి రామకృష్ణ, అరుణకుమారీకి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. గురువారం రాత్రి కురిసిన వర్షం, ఈదురుగాలులకు గ్రామంలో విద్యుత్ సరఫరా అయ్యే మెయిన్ వైరు జారి కిందకు వేలాడింది. శుక్రవారం రామకృష్ణ చిన్న కుమార్తె పాఠశాలకు వెళ్లడానికి పనులు చేసుకుంటూ ఇంటి ప్రాంగణంలో ఉన్న తాడుపై దుస్తులు ఆరేసుకుంటుంది. తాడు పై నుంచి (మనుషులకు తగిలే ఎత్తులో) విద్యుత్ మెయిన్‌వైరు వెళ్లడంతో సౌమ్యశ్రీ (15)కి విద్యుత్ షాక్ తగిలింది. ఇది గమనించిన అన్నయ్య అజయ్‌కుమార్, అతడి స్నేహితుడు కొడమంచిలి సిద్దూ సౌమ్యశ్రీని కాపాడే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నంలో ఇద్దరికి గాయాలయ్యాయి. సిద్దూ స్థానికంగా చికిత్స పొందగా అజయ్‌కుమార్, సౌమ్యశ్రీని కొవ్వూరు తీసు కువెళ్లేలోపు సౌమ్యశ్రీ మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు పెద్దఎత్తున ఆసుపత్రికి చేరుకుని ఆందోళన చేపట్టారు. విద్యుత్ వైర్లు కిందకు ప్రమాదకరంగా వేలాడుతున్నాయని.. పైకి కట్టాలని పంచాయితీ అధికారులు, పాలకులకు, విద్యుత్ లైన్ మెన్‌లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఇంకా ఎంతమంది బలైపోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అన్నివిధాలా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తల్లితండ్రుల ఫిర్యాదు మేరకు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు కేసు నమోదు చేశారు. మృతదేహానికి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. సౌమ్యశ్రీ ధర్మవరం జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతుంది. ఈనెల3న పుట్టినరోజును చేసుకుంది. మరుసటి రోజే ఎంత దారుణం జరిగిపోయిందని బంధువులు కన్నీరు మున్నీరయ్యారు


సౌమ్యశ్రీ (ఫైల్‌ఫొటో)


ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

అదృశ్యమైన యువకుడి దారుణ హత్య

- పాతిపెట్టిన పది రోజుల అనంతరం వెలుగు చూసిన వైనం
- కాకినాడ జిల్లా పి.వేమవరంలో ఘటన
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు

సామర్లకోట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పి.వేమవరంలో నొక్కు కిరణ్‌కార్తీక్ (24) అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకుల చేతిలో అత్యంత దారుణంగా హత్యకు గురయ్యాడు. మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా గ్రామ శివారున జగనన్న లేఅవుట్ మైదానంలో గొయ్యితీసి పూడ్చివేశారు. పది రోజుల అనంతరం హత్యోదంతం వెలుగుచూసింది. మృతుడి తండ్రి వెంకటరమణ తన కుమారుడు కనిపించడం లేదంటూ సామర్లకోట పోలీసులకు గత నెల 27న ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. మృతుడు సంఘటనకు ముందువరకూ వినియోగించిన సెల్‌ఫోన్‌లో నిక్షిప్తమైన కాల్ నంబర్ల ఆధారంగా ఇద్దరు యువకులను పోలీ సులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించడంతో వాస్తవం బయటకు వచ్చింది. కార్తీక్‌ను హత్య చేసినట్టుగా భావించి అదే గ్రామానికి చెందిన నులకతట్టి కృష్ణప్రసాద్, అతడి మరో స్నేహితుడు వినోద్‌ను శుక్రవారం బ్రహ్మానందపురం జగనన్న లేఅవుట్ వద్దకు తీసుకురాగా కార్తీక్‌ను హతమార్చిన అనంతరం పాతిపెట్టిన గొయ్యిని పోలీసుల కు చూపించడంతో మృత దేహాన్ని వెలుపలికి తీశారు. అయితే హత్య జరిగిన పది రోజుల అనంతరం నిందితులు గ్రామ రెవెన్యూ అధికారి వద్ద లొంగి పోయినట్టు పోలీసులు చెబుతున్నారు. అనంతరం పంచనామాల ప్రక్రియ పూర్తిచేసి నింది తులను కాకినాడ కోర్టు ఎదుట శుక్రవారం హాజ రుపరిచారు. ఘటనా స్థలానికి చేరుకున్న మృ తుడి కుటుంబసభ్యులు బోరున విలపించారు. తన కుమారుడిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వీర వెంకటరమణ పోలీసుల ఎదుట డిమాండ్ చేశాడు.


హత్యకు గురైన కిరణ్‌కార్తీక్(ఫైల్)

సెల్‌ఫోన్ సంభాషణలే కారణమా?

కిరణ్ కార్తీక్ దారుణ హత్యకు ప్రధాన కారణం హత్య చేసిన కృష్ణప్రసాద్ చెల్లెలితో కిరణ్ కార్తీక్ సెల్‌ఫోన్‌లో తరచూ మాట్లాడుతుండడమేనని తెలుస్తుంది. తొలుత కార్తీక్‌ను కృష్ణప్రసాద్ హెచ్చరించినప్పటికీ అతడు ఖాతరు చేయకుండా ఫోన్ సంభాషణలు కొనసాగించడాన్ని సహించలేక కార్తీక్‌ను ఎలాగైనా తప్పించాలని కృష్ణప్రసాద్ పథకం వేశాడు. ఇందుకు అతడి స్నేహితుడు వినోద్‌ను ఉపయో గించాడు. వినోద్ ద్వారా కార్తీక్‌ను మందు పార్టీ ఉందని గతనెల 24న రాత్రి బ్రహ్మానందపురం శివారు జగనన్న లేఅవుట్ వద్దకు పిలిపించి కార్తీక్ తల పై కర్రతో బలంగా మోది పీకనులిమి కిరాత కంగా హత్య చేశారు. అక్కడే గొయ్యి తవ్వి పూడ్చి వేసి ఇంటికి చేరుకున్నారు. అయితే ఇంకా పలు అంశాలను పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

‘వంగవీటి రంగా కారణజన్ముడు’

మలికిపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వంగవీటి రంగా కారణ జన్ముడని, మూడు దశాబ్దాలు క్రితం ప్రజల నుంచి దూరమైనా వారి మదిలో చిరస్థాయిగా ఉన్న మహా నాయకుడని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రంగా తనయుడు వంగవీటి రాధా అన్నారు. శుక్రవారం రంగా జయంతి సందర్భంగా కోనసీమ జిల్లా మలికిపురంలో రంగా నిలువెత్తు విగ్రహాన్ని అభిమానులు ఏర్పాటు చేయగా వారిద్దరూ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభలో మాట్లాడుతూ రంగా ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు పాటుపడాలన్నారు. బడుగు, బలహీనవర్గాల కోసం నిరంతరం పోరాటం చేసి బడుగుల కోసమే ప్రాణాలు అర్పించిన మహానేత అన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, దిరిశాల బాలాజీ, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, పినిశెట్టి బుజ్జి, ముప్పర్తి నాని, బొల్లం ప్రసాద్, ఎంపీపీ ఎంవీ సత్యవాణి తదితర నాయకులు పాల్గొన్నారు. వంగవీటి రాధాను చించినాడ వంతెన నుంచి యువకులు భారీగా ర్యాలీగా తీసుకువచ్చారు. దారిపొడవునా యువకులు నినాదాలు చేశారు.


మలికిపురంలో వంగవీటి రంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన వంగవీటి రాధా, ఎమ్మెల్యే దేవ

అరుణాచలేశ్వర ఆలయంలో ఆధ్యాత్మిక సందడి

ప్రత్తిపాడు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి అడ్డురోడ్డు వద్ద అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఆధ్యాత్మిక సందడి ప్రారంభమైంది. ఈ నెల 7న ఈ ఆలయంలో నాయినార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా 3రోజులు ముందు నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం ఆలయ వ్యవస్థాపకులు రామానంద స్వామి, ప్రముఖ నాయినార్ల చరిత్రకారణి ఆధ్యాత్మిక ప్రవచన కర్తఅరుణాచల మాధవి ఆధ్వర్యంలో అర్చకులు గోపూజ, గణపతి హోమం, లక్ష్మి హోమం, నవగ్రహ హోమాలు నిర్వహించారు.


గణపతి పూజ నిర్వహిస్తున్న వేద పండితులు


డొంకరాయి జలాశయంలో పెరిగిన నీటి నిల్వలు

జలాశయాలు కళకళ

మోతుగూడెం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా వర్షాలకు సీలేరు కాంప్లెక్స్‌లోని జలాశయాల్లో నీటి మట్టాలు స్వల్పంగా పెరిగాయి. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటి నిల్వలతో కళకళలాడుతున్నాయి. గురువారానికి జోలాపుట్టు జలాశయానికి 8936 క్యూసెక్కులు, బలిమెలకు 19,439, సీలేరుకు 1655, డొంకరాయికి 4030క్యూసెక్కుల నీటి నిల్వలు చేరాయి. గత 24గంటల్లో 250 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు జెన్‌కో అధికారులు తెలిపారు. ప్రస్తుతం బలిమెల, జోలాపుట్‌లో 28.91 టీఎంసీల నీటి నిల్వలు ఉండగా, ఇందులో ఏపీ వాటాగా 16.07 టీఎంసీలు ఉన్నాయి. గుంటవాడ, డొంకరాయి జలాశయాల్లో కలిపి 6.67 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం సీలేరు కాంప్లెక్స్‌లో 22.74 టీఎంసీల నిల్వలున్నారు. డిమాండ్ మేరకు కాంప్లెక్స్‌లో రోజుకు 4 నుంచి 5 మిలియన్ యూనిట్ల వరకూ విద్యుదుత్పత్తి చేస్తున్నారు.

గండి పోశమ్మ ఆలయంలోకి వరదనీరు


గండి పోశమ్మ ఆలయంలోకి వచ్చిన వరద నీరు



దేవీపట్నం, జూలై 4(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం గొందూరు గ్రామంలో వేంచేసిఉన్న స్వయంభూ మాతృ శ్రీగండి పోశమ్మ ఆలయంలోకి వరద నీరు ప్రవేశించింది. దీంతో దర్శనాలను తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. అనుమతించే తేదీ ప్రకటించేవరకు ఎవరు ఆలయం పరిసర ప్రాంతాలకు రాకూడదన్నారు.

వాడపల్లి క్షేత్రంలో సెల్‌ఫోన్లు భద్రపరుచుకునేందుకు
రూ.62 లక్షలకు టెండర్ హెచ్చుపాట


టెండర్లు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సెల్‌ఫోన్లు భద్రపరుచుకునేందుకు శుక్రవారం నిర్వహించిన టెండర్‌లో రూ.62 లక్షలకు ఓ వ్యక్తి హెచ్చుపాటను దక్కించుకున్నాడు. వాడపల్లి క్షేత్రంలో 7 ప్రదక్షిణలు నిర్వహించుకునే సమయంలో భక్తుల సెల్‌ఫోన్లు చోరీకి గురవుతున్నాయి. గతేడాది నుంచే సెల్‌ఫోన్లు భద్రపరుచుకునేందుకు లాకర్లను ఏర్పాటు చేసి టెండర్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. భక్తుల పాదరక్షకులు భద్రపరుచుకునేందుకు రూ.5 లక్షలు, లగేజీ బ్యాగ్‌లు భద్రపరుచుకునేందుకు రూ.5 లక్షలు టెండర్ దాఖలు చేసి సొంతం చేసుకున్నారు. సెల్‌ఫోన్ భద్రపరుచుకునేందుకు రూ.5, చెప్పులు, బ్యాగులు భద్రపరుచుకునేందుకు రూ.2 భక్తులు చెల్లించాలి. టెండర్లను ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షించారు. శుక్రవారం అధికసంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రూ.3,99,132 ఆదాయం లభించినట్టు ఈవో తెలిపారు.

‘లోవ’ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

తుని రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్య క్షేత్రం లోవ దేవస్థానంలో భవిష్యత్ తరాల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికను దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించారు. ఈ మేరకు పలువురు నిష్ణాతులైన ఇంజనీరింగ్ అధికారులతో మాస్టర్ ప్లాన్ రూపొందించగా వీటిపై శుక్రవారం ఇంజనీరింగ్ అధికారులు లోవ క్షేత్రంలో పర్యటించి వాటి అమలు రూపకల్పనకు సాధ్యసాధ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.దుర్గేష్‌కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.ఉదయభాస్కర్, డిప్యూటీ స్తపతి శ్రీనివాసచార్యులు, ఈవో విశ్వనాథ్‌రాజు పాల్గొన్నారు.


మాస్టర్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న దేవదాయ శాఖాధికారులు

సారె సమర్పణ

ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా లోవ క్షేత్రంలో తలుపులమ్మ అమ్మవారికి శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి భక్తసమాజం ఆధ్వర్యంలో తుని పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారికి సారె సమర్పించేందుకు తరలివచ్చారు. ఆలయ పండితులు స్వాగతం పలకగా అమ్మవారికి నూతనవస్త్రాలతో పాటు పండ్లు, పుష్పాలు, పొంగళ్లు, పిండి వంటలు నైవేద్యంగా సమర్పించుకున్నారు. ఆలయ పండితులు వేద ఆశీర్వాదం గావించి మహాప్రసాదం భక్తులకు అందించారు.




తలుపులమ్మకు సారె సమర్పించేందుకు వచ్చిన భక్తులు

తాటిపాకలో మాజీ సీఎం రోశయ్య జయంతి

రాజోలు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 92వ జయంతిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం తాటిపాకలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రోశయ్య విగ్రహానికి ఆయనతో పాటు సంఘ సభ్యులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. 92 మంది పారిశుధ్య సిబ్బందికి, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కంచర్ల బాబి మాట్లాడుతూ మాజీ సీఎం రోశయ్య జయంతిని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ప్రతి ఆర్యవైశ్యుడు గర్వించాల్సిన విషయమని, ఇటువంటి మంచి నిర్ణయం తీసుకున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి ఆర్యవైశ్యులందరి తరపున కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్ లక్డీకపూల్‌లో రోశయ్య కాంస్య విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఏపీఐఐసీ మాజీ ఛైర్మన్ శ్రీఘాకోళపు శివరామసుబ్రహ్మణ్యం పిలుపు మేరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. మంత్రి కందుల దుర్గేష్ నుంచి ఉత్తమ ప్రెసిడెంట్ అవార్డు అందుకున్న రాజోలు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కాసు శ్రీనివాస్‌కు దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఉమ్మడి తూర్పు గోదావరి ఆర్యవైశ్య సంఘం వాణిజ్య విభాగం ఛైర్మన్ లక్కింశెట్టి బాబులు, నానాజీ, రత్నబాబు, నాగబాబు, పోశెట్టి బుజ్జి, సూరిబాబు, కొత్త శ్రీనివాసరావు, రాజానాగరత్నకుమార్ పాల్గొన్నారు.


తాటిపాకలో పారిశుధ్య సిబ్బందికి దుప్పట్లు పంపిణీ చేస్తున్న కంచర్ల బాబి

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు



కొంకాపల్లిలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

సాయుధ పోరాట యోధుడు 'అల్లూరి'

● ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ● ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి

అమలాపురంరూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం సాయుధ పోరాటాన్ని ఎంచుకుని బ్రిటీషు పాలకులను గడగడలాడించిన మహనీయుడిగా అల్లూరి సీతారామరాజు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. వన్నెచింతలపూడిలో మన్యంవీరుడు అల్లూరి జయంతిని జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తొలుత గ్రామంలోని అల్లూరి విగ్రహానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా చైర్మన్ అల్లాడస్వామినాయుడుతో కలిసి ఎమ్మెల్యే పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా రాజారత్న నాగమణి, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి, మాజీఎంపీపీలు బొర్రా ఈశ్వరరావు, యెరుబండి వెంకటేశ్వరరావు, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చొల్లంగి సత్యసాయిబాబా, ప్రధాన కార్యదర్శి దేవరపల్లి వీరేష్‌కుమార్, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొలమూరి ధర్మపాల్, నాయకులు మట్టా మహాలక్ష్మిప్రభాకర్, మల్లుల పోలయ్య, జంపన వెంకటేశ్వరరాజు, దంతులూరి వాసురాజు, పాలాటి బాలయోగి, మంథా ఫణి, రాజులపూడి భీముడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొంకాపల్లి క్షత్రియ కల్యాణ మండపం ప్రాంగణంలో ఉన్న అల్లూరి విగ్రహానికి ఎమ్మెల్యే ఆనందరావు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దున్నాల దుర్గ, పెన్మెత్స శ్రీనివాసరాజు, రుద్రరాజు చిట్టిరాజు, నడింపల్లి సుబ్రహ్మణ్యరాజు, దాట్ల గోపిరాజు తదితరులు పాల్గొన్నారు. అమలాపుం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. రంగాపురంలో అల్లూరి విగ్రహానికి మాజీ సర్పంచ్ నడింపల్లి ఉదయబాబురాజు, తాలూకా సీఐ డి.ప్రశాంత్‌కుమార్, తాలూకా ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు, సర్పంచ్ పరమల శ్యామ్‌కుమార్, భూపతిరాజు కిరణ్‌వర్మ, భూపతిరాజు లవవర్మ, సాగిరాజు సుబ్బరాజు, ఉపసర్పంచ్ మామిళ్లపల్లి దొరబాబు నివాళులర్పించారు. రోళ్లపాలెం గున్నాపంతుల అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాలలో అల్లూరి జయంతిని ఘనంగా జరిపారు. అల్లూరి చిత్రపటానికి సంఘ చైర్మన్ బొంతు వరప్రసాదరావు, గౌరవాధ్యక్షురాలు ముంగమూరి లలితకుమారి, వ్యవస్థాపక అధ్యక్షుడు ఏవీ అప్పారావు, అధ్యక్షురాలు పెదపూడి మనీషా, ప్రధాన కార్యదర్శి శీలం రామమణికంఠ పూలమాలలువేసి నివాళులర్పించారు.

అల్లవరం: దేశం కోసం పోరాడి ప్రాణాలు అర్పించిన విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు తాగ్యనిరతి చిరస్మరణీయమని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. కోడూరుపాడులో అల్లూరి జయంతి సందర్భంగా భారీ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలువేసి నివాళులర్పించారు. ప్రముఖులు మెట్ల రమణబాబు, పెచ్చెట్టి చంద్రమౌళి, అల్లాడ స్వామినాయుడు, నడింపల్లి సుబ్బరాజు, వేగిరాజు వెంకట్రాజు, దాట్ల గోపీరాజు, గుంటూరి కృష్ణంరాజు, మంతెన సురేష్, గుంటూరి బాలవెంకట్రాజు, కె.కాశీరాజు, శ్రీనురాజు పాల్గొన్నారు.

అల్లూరి చిరస్మరణీయుడు: ఎమ్మెల్యే దేవ

మలికిపురం: స్వాతంత్ర్య సమరయోధులు అల్లూరి సీతారామరాజు చరిత్ర ఉన్నంతకాలం చిరస్మరణీయుడని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మలికిపురం మండల పరిషత్ కార్యాలయ సమీపంలో అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా అల్లూరి రాంబాబురాజు సోదరులు ఏర్పాటుచేసిన విగ్రహాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే ఏ వీసూర్యనారాయణరాజు, అల్లూరి వెంకట్రామరాజు, అల్లూరి రామలింగరాజు, అల్లూరి శివకుమార్‌రాజు, అడబాల యుగంధర్, డెల్టాప్రాజెక్టు కమిటీచైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, పెదకాపు, బాలాజీ, శ్రీదేవిపాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ కార్యాలయంలో..

అమలాపురం, జూలై 4(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ బి.కృష్ణారావు తొలుత అల్లూరి చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్‌తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొని అల్లూరి చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించడంతోపాటు పోలీసుల ఆధ్వర్యంలో గౌరవ వందనం చేశారు. మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు సేవలను వారు ప్రశంసించారు. పలువురు పోలీసు ఉన్నతాధికారులు, సీఐలు, డీఎస్పీలు, ఎస్‌ఐలతో పాటు ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయంలో..

అహింసా పద్ధతుల ద్వారా స్వాతంత్ర్య సమరం జరిపిన విప్లవయోధుడు అల్లూరి సీతారామరాజు అని అమలాపురం ఆర్డీవో కె.మాధవి అన్నారు. స్వాతంత్రోద్యమాల ద్వారా ఆంగ్లేయులను హడలెత్తించిన యోధుడిగా ఆమె పేర్కొన్నారు. మన్యంవీరుడు అల్లూరి జయంతి సందర్భంగా ఆర్డీవో కార్యాలయంలో సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలువేసి ఆర్డీవో మాధవి ఆధ్వర్యంలో సిబ్బంది నివాళులర్పించారు.

అంబాజీపేట: మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని కె.పెదపూడి, మొసలపల్లి, గంగలకుర్రు, పుల్లేటికుర్రు గ్రామాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గుంటూరి మురళీకృష్ణంరాజు, సత్తి రాజా, వెంకటపతిరాజు, జమ్మి, శ్రీనురాజు, గౌతమ్‌లుపాల్గొన్నారు. పుల్లేటికుర్రు పాఠశాలలో అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించారు.

ముమ్మిడివరం: మండలంలోని చినకొత్తలంక, ముమ్మిడివరం సీఐటీయూ కార్యాలయంలోను అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పి.ఉదయ్యభాస్కరవర్మ, టీడీపీ నాయకుడు పి.మల్లికార్జునవర్మ, ముదునూరి పద్మనాభరాజు, పత్సమట్ల వీరవెంకట సత్యనారాయణరాజు, పొత్తూరి వీరవెంకట సత్యనాగరాజు, పెద్దిరెడ్డి శ్రీనివాస్, పొత్తూరి వెంకటపతిరాజు, పత్సమట్ల సుబ్రహ్మణ్యవర్మ, ముదునూరి బలరామరాజు, పత్సమట్ల కృష్ణంరాజు, పి.చైతన్యవర్మ, పి.సీతారామరాజు, సర్పంచ్ పి.ఉమారాణి, ఎంపీటీసీ పొత్తూరి వీణారాణిలతో పాటు పలువురు పాల్గొన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో సీఐటీయూ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి వ్యవసాయకార్మిక సంఘం నాయకులు పాము బాలయ్య, విత్తనాల ఏడుకొండలు, ముమ్మిడివరం శ్రీరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయుడు వీర్రాజుదుర్గారావు, నిమ్మకాయల వెంకటేష్, దొమ్మేటి వీరరాఘవులు, కె.లక్ష్మణరావు, గణేష్, గోవిందరాజు పాల్గొన్నారు.



మలికిపురంలో అల్లూరి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దేవ



ఎస్పీ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ కృష్ణారావు, ఏఎస్పీ ప్రసాద్

అయినవిల్లి: ముక్తేశ్వరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిమ్మకాయల గణేష్ ఆధ్వర్యంలో పలువురు అల్లూరి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మోడల్ ప్రైమరీ ప్రధానోపాధ్యాయుడు నేరేడుమిల్లి సత్యనారాయణ, యల్లమిల్లి ఫణికుమార్, గుబ్బల సాయిశ్రీనివాస్ పాల్గొన్నారు.

కాట్రేనికోన: గెద్దనపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు మట్ట శివకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్ఎస్ఎస్ ప్రతాపరాజు పాల్గొని అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళిఅర్పించారు. బీజేపీ జిల్లా ట్రెజరర్ గ్రంధి నానాజీ, మట్ట సూరిబాబు, కొత్తలంక సురేష్, గుబ్బల భైరవమూర్తి, కొవ్వూరు సత్యనారాయణరాజు, కొవ్వూరు వెంకటనరసింహరాజు, ఇందుకూరి సూర్యనారాయణరాజు, అల్లూరి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

యానాం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి పురష్కరించుకుని ఆయన విగ్రహానికి ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ అఖిల్, సీఐ ఆడలరసన్ తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. అదేవిదంగా జాతీయ జెండ రూపకర్త పింగళి వెంకయ్య, సంఘ సంస్కర్త స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా ఫెర్రి రోడ్డులోని వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యానాం క్షత్రియ పరిషత్ క్షత్రియ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో రామురాజు, దాట్ల దేవదానంరాజు, వెంకటకృష్ణాంరాజు, వర్మ, ముదునూరి సహదేవరాజు, సుబ్బరాజు, జేఆర్‌కె పాల్గొన్నారు.

మామిడికుదురు: బీజేపీ నేత నక్కా త్రిలోచనరావు ఆధ్వర్యంలో మగటపల్లిలో అల్లూరి చిత్రపటానికి, అప్పనపల్లిలో స్థానికులు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కంకిపాటి వెంకటేశ్వరరావు, కుంచే శ్రీనివాస్, కట్టా రాజు, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: భీమనపల్లి శ్రీమతి శిరంగు రంగనాయకమ్మ జడ్పీ హైస్కూల్లో శుక్రవారం అల్లూరి సీతారామరాజు జయంతిని జరుపుకున్నారు. సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. హెచ్ఎం నూకల సత్యనారాయణ, స్టాఫ్ సెక్రటరీ నడింపల్లి పద్మనాభన్, కుడుపూడి భాగ్యలక్ష్మి, వేటూరి, కామన మధు, కరాటం ప్రసాద్, శ్రావణి, గన్నవరపు రాంబాబు, అనుపమ, అనూరాధ, రాజేశ్వరి, రత్నకుమారి పాల్గొన్నారు.

అంతర్వేది: మన్యంవీరుడు అల్లూరి జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి ఘన పూలమాలలతో నివాళులర్పించారు. సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, మాజీ సర్పంచ్ వైసీపీ రాష్ట్ర కార్యదర్శి జంపన బుజ్జిరాజు, ఇందుకూరి సుబ్బరాజు, ఉపసర్పంచ్ రమేష్‌రాజు, కృష్ణంరాజు, ఆంజనేయరాజు నివాళులర్పించారు.

మహనీయులను యువత ఆదర్శంగా తీసుకోవాలి

● ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

● ఘనంగా రంగా జయంతి





పి.గన్నవరంలో రంగా, అల్లూరి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ముమ్మిడివరంలో కేక్ కట్‌చేస్తున్న దృశ్యం

పి.గన్నవరం, జూలై 4(ఆంధ్రజ్యోతి): మహనీయుల ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. పి.గన్నవరంలో వంగవీటి మోహనరంగా, అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొని అనంతరం మాట్లాడారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో సీతారామరాజు, రంగా చిత్రపటాలకు నివాళులర్పించారు. అక్విడెక్టువద్ద యువకులు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్న రంగా, సీతారామరాజు విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. నరేంద్రపురం సెంటర్‌లో రంగాయూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, నియోజకవర్గ టీడీపీ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబులు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ వైసీపీ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు వైసీపీ ఆధ్వర్యంలో అక్విడెక్టు వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రంగా విగ్రహం వద్ద నివాళులర్పించారు. అక్విడెక్టు వద్ద కాపు నాయకులు అడ్డగళ్ల వెంకటసాయిరాం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు రంగా విగ్రహానికి నివాళులర్పించారు. లంకలగన్నవరంలో నాయకులు చిట్టాల రామజోగేశ్వరావు, గనిశెట్టి ఈశ్వర్, యర్రంశెట్టి వెంకటరమణతో పాటు పలువురు నాయ కులు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అంబాజీపేట: రంగా ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. కాపు సామాజిక నేత దివంగత వంగవీటి మోహనరంగా జయంతిని శుక్రవారం అంబాజీపేట, ఇరుసుమండ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. అంబాజీపేట జడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న రంగా విగ్రహానికి పలువురు పూలమాలలువేసి నివాళర్పించారు. నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, గణపతి వీరరాఘవులు, మైపాల తాతాజీ, కొర్లపాటి గోపి, కొర్లపాటి వెంకటేశ్వరరావు, రమేష్, రవణం విజయ్, వాసంశెట్టి కుమార్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

రాజోలు: తాటిపాక సెంటర్‌లో దివంగత వంగవీటి రంగా జయంతిని శుక్రవారం రంగా రాధా మిత్రమండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం రంగా విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోతు కాశీ, ఉపసర్పంచ్ కటికిరెడ్డి బుజ్జి, జక్కంపూడి వాసు, సాధనాల రమేష్, లంకలపల్లి సుబ్బారావు, తాటికాయల బాబులు, తుమ్మలపల్లి నారాయణ, ఏపుగంటి సత్యనారాయణ, కొమ్మూరి ఏసు, బండారు నాయుడు, అడబాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి స్వర్గీయ వంటవీటి మోహనరంగా జయంతిని ముమ్మిడివరంలో ఘనంగా నిర్వహించారు. జనసేన పట్టణాధ్యక్షుడు కర్రా దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో లంకతల్లెమ్మ గుడి సెంటర్‌లో భారీ కేక్‌ను కట్‌చేసి అభిమానులకు పంచారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో పండ్లు, పాలు, బ్రెడ్లు పంచారు. బళ్లగేటు సెంటర్‌లోని అన్న క్యాంటీను ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజననం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో గోదశి నాగేశ్వరరావు, చెల్లి అశోక్, తాడి జానకీరామ్, గుద్దటి విజయ్, దూడల స్వామి, పోలిశెట్టి కృష్ణ, యేడిద దొరబాబు, మాదాల పరంకుశం, చింతలపూడి పల్లంరాజు, ములపర్తి బాలకృష్ణ, విళ్ల వీరాస్వామినాయుడు, వీరా శ్రీనివాస్, నిమ్మకాయల వీరబాబు పాల్గొన్నారు.

అయినవిల్లి: రంగా జయంతిని పురస్కరించుకుని క్రాప గ్రామంలో రంగా విగ్రహానికి పలువురు పూలమాలలువేసి నివాళులర్పించారు. శంకరాయగూడెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో కేక్ కట్‌చేసి అందరికీ పండ్లు, బిస్కెట్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. రాధారంగా మిత్రమండలి ప్రతినిధులు దామిశెట్టి అంజి, తాడేపల్లి కృష్ణ, చిక్కం సత్యనారాయణ, ఏసు, పి.సాయి, సుంకర వీరబాబు, ఆకుల బలరామ్, బొబ్బిలి శివాజీ, బొబ్బిలి రాజా, రంగబాబు, రంగా అభిమానులు పాల్గొన్నారు.

అల్లవరం: బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగా జయంతిని అల్లవరం, డి.రావులపాలెం గ్రామాల్లో ఘనంగా జరిగాయి. రంగా విగ్రహాలకు అభిమానులు పూలమాలలువేసి నివాళులర్పించారు. కంకిపాటి వీరబాబు, బండిగుప్తాపు చిట్టివెంకన్న, కంకిపాటి సుబ్బారావు, దాసం రాముడు, మెరికల శ్రీను, బి.సూరిబాల, సుంకర సాయి, కంకిపాటి అరుణ్, ఎం.అజయ్ తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: రంగా వర్ధంతిని బి.దొడ్డవరం, అప్పనపల్లి గ్రామాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బి.దొడ్డవరంలో కాంగ్రెస్, జనసేన నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కంకిపాటి వెంకటేశ్వరరావు, అప్పన రామకృష్ణ, నీతిపూడి బాలసత్యనారాయణ, వాకపల్లి రాంబాబు, వాణరాశి దుర్గారావు, జనసేన నాయకులు జాలెం శ్రీనివాసరాజా, అడబాల తాతకాపు, మందా గాంధీ, తులా బ్రహ్మజీ, సతీష్, ఎంపీటీసీ వాసంశెట్టి వెంకటరమణ, కార్యకర్తలు పాల్గొన్నారు

ఉప్పలగుప్తం : స్వర్గీయ వంగవీటి మోహన్ రంగా జయంతిని యువత ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. గొల్లవిల్లి సెంటర్‌లో రాధారంగా మిత్రమండలి ఆధ్వర్యంలో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆకుల సూర్యనారాయణమూర్తి, అరిగెల నానాజీ, చిక్కం సూర్యమోహన్, మద్దింశెట్టి ప్రసాద్, సుంకర బుజ్జి, గుర్రాల ప్రసాద్, పైబోడి పండు, మురమళ్ళ శ్రీను, యెరుబండి భద్ర, పేరాబత్తుల రాజా, గనిశెట్టి శివ, దూలం సూరి, పిల్లా కన్న పాల్గొన్నారు. విలసవిల్లిలో సలాది సతీష్ ఆధ్వర్యంలో రంగా విగ్రహానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు.

అంతర్వేది: సఖినేటిపల్లి మండలం అంతర్వేది కొత్తపేట సెంటర్‌లో ఇటీవల నూతనంగా ఏర్పాటుచేసిన వంగవీటి రంగా విగ్రహం వద్ద జయంతి వేడుకలను జరిపారు. ముందుగా స్థానిక నాయకులతో కలిసి నియోజకవర్గ కూటమి శ్రేణులు విచ్చేసి రంగా విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. శుక్రవారం తీర ప్రాంత గ్రామాల సర్పంచ్‌లు, మండల నాయకులు, నియోజకవర్గ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయంతి వేడుకల్లో భాగంగా కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు

పి.గన్నవరం, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మాజీమంత్రి, నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు చిక్కాల రామచంద్రరావు అన్నారు. నరేంద్రపురం 98వ బూత్‌లో జరిగిన సుపరిపాలన, తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు, నాయకులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ మోకా ఆనందసాగర్, మాజీ ఎంపీపీ త్సల్లా బిందుమాధవరావు, ముచ్చర్ల సాయిసత్యనారాయణ, పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనలో తొలి అడుగు

అమలాపురం రూరల్: సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ప్రతీ ఇంటికీ చేరాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా సుపరిపానలో తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టినట్టు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. వన్నెచింతలపూడిలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం ఏడాది పాలనలో సాధించిన విజయాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ ఎంపీపీలు యెరుబండి వెంకటేశ్వరరావు, బొర్రా ఈశ్వరరావు, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చొల్లంగి సత్యసాయిబాబా, మల్లుల పోలయ్య, జంన వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

అల్లవరం: కోడూరుపాడులో టీడీపీ సుపరిపాలన తొలి అడుగులో భాగంగా ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఇంటింటా తిరిగి ప్రభుత్వ సంక్షేమాలు వివరించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

ముమ్మిడివరం: అర్హులైన ప్రతీ ఇంటికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చెల్లి అశోక్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ముమ్మిడివరం నగర పంచాయతీ 3, 7, 13, 18 వార్డుల్లో వార్డు అధ్యక్షులు, కార్యదర్శులు, బూత్ కమిటీ సభ్యులతో కలిసి పర్యటించారు. కార్యక్రమంలో దొమ్మేటి రమణకుమార్, పిల్లి నాగరాజు, గొల్లపల్లి గోపి, విళ్ల వీరాస్వామినాయుడు, కట్ట సత్తిబాబు, బడుగు సందీప్‌సాయి, పెన్మెత్స సురేష్‌వర్మ, పత్సమట్ల ధర్మరాజు, చప్పిడి ప్రసాద్, నిమ్మకాయల విశ్వేశ్వరరావు, అన్నాబత్తుల చంద్రమౌళి, పెదపూడి రుక్మిణి, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

పేదలకు మంచిరోజులు

● ఎమ్మెల్యే ఆనందరావు

ఉప్పలగుప్తం: కూటమి ప్రభుత్వ సుపరిపాలనతో రాష్ట్రంలో నిరుపేదలకు మంచిరోజులు వచ్చాయని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. స్వగ్రామం ఎస్.యానాంలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్ళి ఇప్పటి వరకు అమలు చేసిన, ఇక ముందు అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించారు. టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు లంకే భీమరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, ఉప్పలగుప్తం నీటి పంపిణీ సంఘం చైర్మన్ దంగేటి చిట్టిబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో ప్రజారంజక పాలన'

అంతర్వేది: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో ప్రజారంజక పాలన నడుస్తుందని సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో కేశవదాసుపాలెం మెండుపాలెంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ విధానాలపై ప్రజలకు వివరిస్తూ వారికి కావాల్సిన అవసరాలు తెలుసుకున్నారు.

సుపరిపాలనతో గ్రామాల అభివృద్ధి

ఐ.పోలవరం: కూటమి ప్రభుత్వ ఏడాది సుపరిపాలనలో గ్రామాలు అభివృద్ధి చెందాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు అన్నారు. తిళ్ళకుప్పలో శుక్రవారం జరిగిన సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమంలో ప్రభుత్వం అమలు చేస్తున్న, చేయబోయే సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వనచర్ల వెంకటేశ్వరరావు, అజయ్‌వర్మ, శీలం వెంకటసురేష్, కడియం వెంకటేశ్వరరావు, సురేంద్రవర్మ, పెన్నాడ త్రినాధరావు, నీలాద్రి పాల్గొన్నారు.

ఘనంగా రోశయ్య జయంతి

అమలాపురం టౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అమలాపురం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి వైశ్య సంఘ పచ్చిగోళ్ల జనార్ధనరావు కల్యాణ మండపంలో నిర్వహించారు. రోశయ్య విగ్రహానికి ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు వరదా సూరిబాబు ఆధ్వర్యంలో పలువురు నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి సింగంశెట్టి కుమార్, సంఘ అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి నంబూరి నరేష్, కోశాధికారి కొమ్మూరి వెంకటాచలప్రసాద్ పాల్గొని పేదలకు చీరలు పంపిణీ చేశారు. కాంగ్రెస్‌పార్టీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి ఆధ్వర్యంలో రోశయ్య జయంతి వేడుకలను నిర్వహించారు. టీడీపీ పట్టణశాఖ అధ్యక్షుడు వంటెద్దు బాబి పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని శుక్రవారం భీమనపల్లిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వరదా శ్రీరామచంద్రమూర్తి, కంకటాల నవీన్, కంకటాల సురేష్, వరదా బుల్లోడు, వరదా కనకరమేష్, కంకటాల సూర్యనారాయణమూర్తి, గోకవరపు వీరేష్, గాది రామం, వరదా నాని తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ రక్షిత మంచినీరు అందిస్తాం: ఎమ్మెల్యే గిడ్డి

అంబాజీపేట, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న మాచవరం ప్రజల మంచినీటి పథకం కళ నేటికి నేరవేరింది. గత 30 ఏళ్లుగా ఈపథకం ద్వారా ఇప్పటివరకూ చుక్కనీరు కూడా రాలేదని ప్రస్తుతం కూటమిప్రభుత్వ అధికారంలోకి వచ్చిన వెంటనే మాచవరం మంచినీటి పథకంపై దృష్టిసారించి ప్రజలందరికీ రక్షిత మంచినీరు అందించే విధంగా కృషిచేశామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మాచవరంలో జలజీవన్‌మిషన్ నిధులు రూ.4కోట్లతో నిర్మించిన ఇంటింటికీ కుళాయిలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఈపథకాన్ని పూర్తిస్థాయిలో చేపట్టి గ్రామంలో ఉన్న ప్రతిఒక్కరికీ రక్షిత తాగునీరు అందిస్తామన్నారు. తొలుత మంచినీటి కుళాయిని ప్రారంభించిన అనంతరం శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఇరిగేషన్‌శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ నామన రాంబాబు, నాయకులు నాగాబత్తుల వెంకట సుబ్బారావు, వీరరాఘవులు, గోపి, మైపాల తాతాజీ, దాసరి వీరవెంకటసత్యనారాయణ, చిన్నం బాలవిజయరావు, చిట్టూరి శ్రీనివాస్, అరిగెల బలరామమూర్తి, అరిగెల సూ రిబాబు, మేడిద శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూ ఎస్ డీఈఈ రవీంద్రబాబు, జెఈలు కళ్యాణ్, జయశ్రీ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

అమలాపురంరూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందికి ఉందని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు సూచించారు. కామనగరువు పంచాయతీ పరిధిలోని బడుగువారిపేటలో శుక్రవారం నిర్వహించిన డ్రైడే ఫ్రైడే ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ప్రస్తుతం జిల్లాలో డెంగ్యూ మాసోత్సవం నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా ప్రజారోగ్య సిబ్బంది ఇంటింటా సర్వే చేపట్టి జ్వర బాధితుల వివరాలు నమోదు చేస్తున్నారన్నారు. ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. సబ్ యూనిట్ ఆఫీసర్ రామారావు, పేరూరి పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో కె.సత్యనారాయణ, సూపర్‌వైజర్ కామేశ్వరరావు, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

'బకాయిలు వడ్డీతో సహా చెల్లించాలి'

అమలాపురంరూరల్, జూలై4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు, కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను వడ్డీతోసహా చెల్లించాలని ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి మేడిది శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీ సిబ్బందితో నడిపించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను ప్రైవేటు యాజమాన్యాలకు అప్పగించరాదని డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీకి సంబంధించి 24 నెలల బకాయిలు చెల్లించాలని, 2023 జూన్ నుంచి 12వ పీఆర్సీ అమలుచేసి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం అమలాపురం ఆర్టీసీ డిపోలో ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి గేట్ మీటింగ్ నిర్వహించారు. డిపో అధ్యక్షుడు పీవీ రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, డిపో కార్యదర్శి ఎస్ఎస్వీ గణేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గేట్ మీటింగ్‌లో జిల్లా అధ్యక్షుడు ఎండీ రజాక్, రావు, భవానీ, రాంబాబు, రవి, ప్రసాద్, సత్తిరాజు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ ధర్నా

రాజోలు: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు రాజోలు డిపో ఎదుట డిపో అధ్యక్షుడు ఎ.వెంకటరెడ్డినాయుడు, రీజనల్ ప్రచార కార్యదర్శి వైవీవీవీఎస్ ప్రసాద్, గ్యారేజీ కార్యదర్శి పీఎస్పీ రావు ఆధ్వర్యంలో రాజోలు డిపో ఎదుట మధ్యాహ్న భోజన సమయంలో శుక్రవారం ధర్నా చేశారు. ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కార్యక్రమంలో కె.హనుమంతరావు, కేవైఎస్ కుమార్, కె.దివ్యశ్రీ, వి.సాయిలత, టీఎస్ వాసు, జి.సత్యప్రసాద్ పాల్గొన్నారు.

'ఎన్పీసీఐతో బ్యాంకు ఖాతాలు అనుసంధానం చేయండి'

అమలాపురం, జూలై 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరిన షెడ్యూల్డు కులాల విద్యార్థులు తల్లికి వందనం పథకం కింద రెండో విడతలో నగదు జమ అయ్యేందుకు వీలుగా వారి బ్యాంకు ఖాతాలు, పోస్టల్ ఖాతాలను ఎన్పీసీఐ అనుసంధానం చేసుకోవాలని జిల్లా ఎస్సీ కులాల సంక్షేమ సాధికారిత అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి విజ్ఞప్తి చేశారు. బ్యాంకు ఖతాలు, పోస్టల్ ఖాతాలు ఎన్పీసీఐ అనుసంధానం కాని విద్యార్థులకు తల్లికి వదనం పడే అవకావం ఉండదని, అందువల్ల ఖచ్చితంగా ఆ ఖాతాలను అనుసంధానం చేసుకుని ప్రభుత్వం ఇచ్చే నగదును పొందేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె విరమణ

అమలాపురంటౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ ఎంప్లాయీస్ యూనియన్లతో సీడీఎంఏ కేంద్ర కార్యాలయంలో జరిగిన చర్చలు సానుకూలంగా ఉండడంతో 58 రోజుల అనంతరం సమ్మె విరమిస్తున్నట్టు ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ యూనియన్ జిల్లాశాఖ అధ్యక్షుడు యెరుబండి వెంకటసత్యనారాయణ తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్‌ను కలిసి సమ్మె విరమణ పత్రాన్ని అందజేశారు.

'వైసీపీ శవ రాజకీయాలు మానాలి'

మలికిపురం, జూలై 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ శవ రాజకీయాలను మానుకోవాలని, అసత్య ప్రచారాలను ఖండించాల్సిన అవసరం తనపై ఉందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రాజోలు నియోజకవర్గంలో కుల మతాలకు అతీతంగా తనకు లక్ష ఓట్లు వచ్చాయని, వాటిలో శెట్టిబలిజ సోదరుల పాత్ర ఎంతో ఉందన్నారు. ఇటీవల రాజోలు ఎంపీపీ కేతా శ్రీను మృతి సందర్భంగా వైసీపీకి చెందిన ఒక వ్యక్తి అసత్య ప్రచారాలను, తప్పుడు వ్యాఖ్యలను మలికిపురంలో జరిగిన సమావేశంలో శెట్టిబలిజ నాయకులు ఖండించారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం : డీపీవో శాంతలక్ష్మి

అమలాపురం రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి పేర్కొన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీల ద్వారా తడిచెత్త, పొడిచెత్త సేకరణ కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. శుక్రవారం ఉదయం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న భట్నవిల్లి గ్రామంలో చెత్త సేకరణను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలోని పలు వార్డులకు ఆమె ఇంటింటికీ తిరిగి చెత్త సేకరణ జరుగుతున్న తీరును మహిళలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య సిబ్బందికి డీపీవో శాంతలక్ష్మి పలు సూచనలు చేశారు. ఆమె వెంట గ్రామ కార్యదర్శి రెడ్డిశిరీష, పంచాయతీ,సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పి.గన్నవరం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం 33, 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అత్యవసర మరమ్మతుల నిమిత్తం నాగుల్లంక ఫీడర్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 1 గంటవరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్న ట్లు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు తెలిపారు. లంకలగన్నవరం, మొండెపులంక, నాగుల్లంక, మానేపల్లి, చాకలిపాలెం, వాడ్రేవుపల్లి, కనకాయలంక తదతర గ్రామాలలో వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బాధితులకు మంత్రి సాయం



కుందూరులో ఆర్థికసాయం చేస్తున్న మంత్రి

కె.గంగవరం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కుందూరుకి చెందిన ముగ్గురు, అముజూరుకి చెందిన ఒకరికి కార్మికశాఖ మంత్రి శుక్రవారం ఆర్థికసాయం చేశారు. సుపరిపాలన- తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఆయన గ్రామంలో అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందుల్లో బాధపడుతున్న వారి గురించి కూటమి నాయకుల ద్వారా తెలుసుని ఆర్థికసాయం చేశారు. శనివారపు మునిరాజుకు రూ. 10 వేలు, కాకినాడ చిట్టియ్యకు రూ. 5వేలు, చాపల చిన్న వీర్రాజుకు రూ. 5వేలు, అముజూరుకి చెందిన ఖండవల్లి శ్రీధర్మతేజకు రూ.10 వేల చెక్కును అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రోశయ్యకు ఘన నివాళి



రోశయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న వైశ్య నేతలు

మండపేట, జూలై4 (ఆంధ్రజ్యోతి) స్వర్గీయ మాజీ సీఎం కె.రోశయ్య సేవలు మరువలేనివని పలువురు వైశ్యప్రముఖులు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్య వైశ్యసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రోశయ్య 92వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక మయూరి వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు, పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైశ్యప్రముఖులు కాళ్లకూరి శ్రీనివాస్, కంచర్లప్రసాద్, కేశవరంపు శ్రీనుమమద్దుల సుబ్బారావు, వాకచర్ల నాగబాబు, చామర్తిలోవరాజు, తదితరులు పాల్గొన్నారు.

అంగర పీహెచ్‌సీకి వైద్యాధికారి నియామకం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కపిలేశ్వరపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : వైద్యాధికారులు లేకుండా వైద్యపరీక్షలు ఎలా? అన్న 'ఆంధ్రజ్యోతి' కథనం పై డీఎంహెచ్‌వో వెంటనే స్పందించారు. ఆలమూరు మండలం చొపెల్ల పీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్యాధికారి డాక్టర్ బి. అనంత రామకృష్ణను అంగర పీహెచ్‌సీ వైద్యాధికారిగా నియమించారు. దీంతో శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. దీంతో స్థానిక ప్రజాప్రతినిధులు, పడమరఖండ్రిక, అంగర గ్రామాల సర్పంచ్‌లు తిరునాతి ఆదిలక్ష్మి వెంకటేశ్వర్లు, వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీలు, గ్రామస్థులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

కపిలేశ్వరపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో విద్యుత్ సమస్యలను ఆ శాఖ అధికారులతో కలిసి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం అంగర విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని అత్యధిక సమస్యలున్న మండలం కపిలేశ్వరపురం అన్నారు. వాటి పరిష్కారానికి నూతనంగా నియమితులైన ఎస్ఈ రాజేశ్వరి ప్రత్యేక శ్రద్ధ వహించి, మండలాన్ని దత్తత తీసుకుని 19 గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. డీఈ రత్నాలరావు, ఏడీఈ శ్రీధర్, ఏఈ సత్యనారాయణ, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ రెడ్డి ప్రసాద్, వైస్ ఎంపీపీ గుణ్ణం భానుప్రసాద్, పలువురు ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వినియోగదారులు పాల్గొన్నారు.

'దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి'

రాయవరం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ అనుబంధం) అధ్యక్షుడు రాగుల రఘువులు, ఐఎఫ్‌టీయూ కోశాధికారి గుబ్బల ఆదినారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం చెల్లూరు గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో లంక రాంబాబు, ఎం. ప్రసాద్, జయ రవికుమార్, ఎం.సత్యనారాయణ, దాసరి రాజు, గంటా బాలరాజు, మడికి రాము, చాపల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో రంగా విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, తదితరులు



కే.గంగవరం: రంగా విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

స్వర్గీయ 'వంగవీటి' గొప్ప నేత

• ఘనంగా నివాళి అర్పించిన పలువురు నాయకులు, తదితరులు

మండపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పేదల ఆశాజ్యోతి స్వర్గీయ వంగవీటి మోహనరంగా అని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కొనియాడారు. పట్టణంలోని కరాచీ సెంటర్ వద్ద ఉన్న రంగా విగ్రహానికి స్థానిక నేతలతో కలిసి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. అలాగే బైపాస్‌రోడ్డులో వున్న విగ్రహానికి రంగా మిత్రమండలి అధ్యక్షుడు పడాల సతీష్, ద్వారపూడి, కేశవరం, ఏడిద, తదితర గ్రామాల్లోనూ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన అభిమానులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు మచ్చా నాగు, మాజీ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, వాదాప్రసాదరావు, ఏఎంసీ ఛైర్మన్ సీహెచ్ రామకృష్ణ,పెదపాటి శ్రీను, సాదనాల చక్రపాణి శెట్టిరవి, పాలచర్ల శిరీష పాల్గొన్నారు.

కే.గంగవరం: సత్యవాడలో వంగవీటి మోహనరంగా 78వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ఉన్న రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకు లు సలాది రాంబాబు, సలాది రామకృష్ణ, సలాది ప్రకాష్, చవాకులు వెంకటేశ్వర రావు, బండారు బద్రి, తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: సోమేశ్వరంలో దివంగత కాపునేత వంగవీటి మోహనరంగా 78వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాపునాడు మండలాధ్యక్షుడు నున్న వెంకటరమణ, కాపు యూత్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న మోహనరంగా విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గరగ శ్రీనివాసరావు, మేడిశెట్టి నాగయ్య, శాకా పెద్ద చోడియ్య, రాకుర్తి సుబ్బారావు, నిమ్మకాయల సాయిరాం ప్రసాద్, గరగ తాతారావు,



సోమేశ్వరంలో ...

గరగ చిట్టిబాబు, నున్న ఈశ్వరుడు, శాకా శ్రీనివాసరావు, అనిశెట్టి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.అలాగే రాయవరంలోనూ ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు శాకా దుర్గా శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ రోడ్డు సమీపంలో ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాలలు నివాళి అర్పించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చాట్రాతి జానకి రాంబాబు, బీజేపీ నేతలు చిరట్ల సుబ్బారావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గరగ రాంబాబు, అబ్బిరెడ్డి శాంతారావు, అంగర జనార్దనస్వామి పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: అంగర, పడమరఖండ్రిక, కోరుమిల్లి, మాచర, టేకి, కేదార్లంక, తదితర గ్రామాల్లో శుక్రవారం వంగవీటి మోహనరంగ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగర గాంధీ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు నాయకులు, రంగ అభిమానులు, అంగర, పడమరఖండ్రిక గ్రామస్థులు పాల్గొని రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను గూర్చి కొనియాడారు.

వెదురుపాకలో వైద్యపరీక్షలు

రాయవరం, జూలై 4(ఆంధ్రజ్యోతి): వెదురుపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను శుక్రవారం రామచంద్రపురం డిప్యూటీ డీఈవో ప్రత్తి రామలక్ష్మణమూర్తి పరిశీలించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

'అల్లూరి' యువతకు స్ఫూర్తిదాయకం



అల్లూరి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

కె.గంగవరం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమ నేత అల్లూరి సీతారామరాజు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని బీజేపీ అనకాపల్లి ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు అన్నారు. శుక్రవారం అల్లూరి జయంతిని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పామర్రు ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య, స్వామి వివేకానంద వర్ధంతిని పురస్కరించుకుని వారి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి చంద్రరావు నాయకులు అవసరాల రమణమూర్తి, గుర్రాల సత్యనారాయణ, నున్న సత్యనారాయణ, సలాదిశేఖర్, ఏ. నారాయణమూర్తి, కవులూరి వెంకటకృష్ణ, సలాది రామకృష్ణ , తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ జన్మదినోత్సవాన్ని నిర్వహించాలి

మండపేట, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పాటు చేసి 30 ఏళ్ల పూర్తవటంతో పాటు ఆవిర్భావ దినోత్సవాన్ని వాడవాడలా ఘనంగా నిర్వహించాలని ఆ సంఘం రాష్ట్ర నాయకులు దూళి జయరాజు, బుంగ సంజయ్‌మాదిగ, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మండపేట బాబు అండ్ బాబు కన్వెన్షన్ హాలునందు శుక్రవారం విలేఖరులతో మాట్లాడారు. దండోరా నాయకులు గాలింకి నాగేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్ సతీష్, దివ్యాంగుల సంఘ నేత నబీ, తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరిదేవిగా బంగారమ్మ

మండపేట, జూలై4 (ఆంధ్రజ్యోతి): ద్వారపూడిలో వేంచేసియున్న బంగారమ్మతల్లి ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని శాకాంబరీ దేవిగా శుక్రవారం భక్తులకు దర్శనమించారు. ఆలయ అర్చకుడు యలమంచిలి భాస్కరశర్మ నేతృత్వంలో అలంకరణ జరిగింది. అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత: ఎమ్మెల్యే





టేకిలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, కోటిపల్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

కపిలేశ్వరపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం టేకి, మాచర సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దాసరి శ్రీనివాస్, బలవరెడ్డి సత్తిబాబు, పుత్సల శ్రీనివాస్, అల్లూరి రామకృష్ణ చౌదరి, గుడాల జయబాబు, మేడిశెట్టి శ్రీనివాస్, దామిని అబ్బు, పుట్టా రాంబాబు, వి. రవిరాజు, గొడవర్తి సత్యనారాయణ, పెదపాటి వసంత, వనుం వెంకన్న, కోన భగవాన్, గుడిసె ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: కోటిపల్లిలో శుక్రవారం సుపరిపాలన- తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ఏడాడి పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వెంటూరు వీర్రాఘవులు చౌదరి, గొడవర్తి రామకృష్ణ, బీజేపీ నాయకుడు కర్రి చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు రాయవరంలో..

రాయవరం: రాయవరంలో శనివారం ఉదయం 8.00 గంటలకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు టీడీపీ సీనియర్ నేత ఉండవిల్లి రాంబాబు తెలిపారు. శుక్రవారం ఆయన రాయవరంలో మాట్లాడుతూ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొని ఇంటింటా పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటారన్నారు. కూటమి నాయకులు, ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రంగాకు ఘన నివాళులు

• మడికిలో విగ్రహావిష్కరణ



మడికిలో వంగవీటి రంగా విగ్రహావిష్కరణ దృశ్యం

ఆలమూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతిగా వంగవీటి మోహన రంగారావు ప్రజల గుండెల్లో సుచిరస్థానాన్ని ఏర్పాటు చేసుకున్నారని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ అన్నారు. మడికి గ్రామంలో రంగా యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వంగవీటి రంగా విగ్రహాన్ని బండారు సోదరులు శుక్రవారం ఆవిష్కరించారు. పేదల పక్షాన నిలిచే నాయకుడిగా రంగా ఎంతో గుర్తింపు పొందారన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి దుర్గారావు, కొత్తపల్లి నరేష్, ఈదల సత్తిబాబు, సూరపురెడ్డి సత్య, సుబ్బరాజు పాల్గొన్నారు. ఆలమూరులో కాపు సంఘం మండలాధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు అధ్వర్యంలో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.అలాగే కూటమి నాయకుల అధ్వర్యంలో రంగా విగ్రహానికి నివాళుల ర్పించారు. చల్లా బాబీ, ఈదల నల్లబాబు, వంటిపల్లి సతీష్, గారపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే మండలంలోని సంధిపూడి, పినపళ్ల, బడుగువానిలంక తదితర గ్రామాల్లో రంగా జయంతిని నిర్వహించారు.

కొత్తపేట: మండలంలోని వాడపాలెంలో రంగా విగ్రహానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలా గే కొత్తపేట పాతబస్టాండ్ సెంటర్‌లోను, అవిడిలోను రంగా విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేదవర్గాలకు రంగా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ధరణాల రామకృష్ణ, పప్పుల కొత్తయ్య, బండారు బుల్లితాత, కడియం భాస్కర్, బండారు రాజేష్, అవిడి ఎంపీటీసీ దూళి సూరిబాబు, పాల్గొన్నారు.

ఆత్రేయపురం: మండలంలోని మెర్లపాలెం, ర్యాలీ, నార్కెడిమల్లి, కట్టుంగ, తాడిపూడి, ఉచ్చిలి, లొల్ల, వాడపల్లి, వెలిచేరు గ్రామాల్లో రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు పాల్గొని రంగా సేవలను కొనియాడారు. యువత బైక్ ర్యాలీ, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వాడపల్లిలో రంగా విగ్రహానికి క్లస్టర్ ఇన్‌చార్జి ముదునూరి వెంకట్రాజు, యేపుగంటి వెంకటేశ్వరరావు, కాశీ కృష్ణ. రంగాకు నివాళులర్పించారు. మెర్లపాలెంలో సర్పంచ్ మెర్ల రాము ఆధ్వర్యంలో రంగా జయంతి జరిపారు.

రావులపాలెం: మండలంలోని రావులపాలెం, ఇమ్మిడివర్పాడు తదితర ప్రాంతాల్లో రంగా విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోపాలపురం జాతీయ రహదారి సెంటర్లో ఉన్న రంగా విగ్రహానికి రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ నివాళులర్పించారు. కార్యక్రమంలో మైగాపుల గురవయ్యనాయుడు, అధికారి నాగు, మోదూరి శివ, ఆకుల శ్రీనివాసరావు, అడపా పార్థసారధి పాల్గొన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): స్థానిక చప్పిడి వారి సావరంలో వంగవీటి మోహనరంగా విగ్రహానికి కాపు సంఘం అధ్యక్షుడు తొగరు బ్రహ్మాజీరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీధర్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కౌన్సిలర్ అంకం శ్రీనివాస్, కనకాల వెంకటేశ్వరరావు, అరిగెల నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాపుజాతికే కాకుండా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి రంగా కృషి చేశారని వారు కొనియాడారు. జైలులో ఉండి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఘనత రంగాకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పెంటపాటి శ్రీను, పోతంశెట్టి కృష్ణ, పసుపులేటి సత్తిబాబు, అక్కల రిష్వంత్‌రాయ్, అక్కల రాగూర్ పాల్గొన్నారు. అనంతరం పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద 50 మంది పేదలకు అన్నదానం నిర్వహించారు.



వాడపల్లిలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కూటమి పాలనలోనే రాష్ట్రాభివృద్ధి

మంత్రి వాసంశెట్టి సుభాష్

పలుచోట్ల తొలి అడుగు కార్యక్రమాలు



రామచంద్రపురంలో పర్యటిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల విధ్వంసమే ఆలంబనగా పనిచేసిందని, నేడు కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలో 24, 25, 26, 27, 28వ వార్డుల్లో ఆయన పర్యటించారు. ఏడాది పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజాభిప్రాయాలు మై టీడీపీ యాప్‌లో పొందుపరిచారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో భయానక వాతావరణం ఉండేదని, నేడు కూటమి అధికారంలోకి వచ్చాక ప్రశాంతత నెలకొందని అన్నారు. 27 వార్డులో వాసంశెట్టి సాయిదుర్గ ఇంటర్ వరకు చదువుకుంది. తల్లి లేదు. తండ్రి అప్పన్న అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆర్థిక పరిస్థితి అనుకూలించక సాయిదుర్గ డిగ్రీ చదవడం లేదు. తొలి అడుగు పర్యటనలో విషయం తెలుసుకున్న మంత్రి సుభాష్ సాయిదుర్గను తాను చదవిస్తానని అప్పన్నతో భరోసా ఇచ్చారు. తక్షణ సాయంగా రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఏకకాలంలో సంక్షేమ, అభివృద్ధి: బండారు

ఆలమూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): పేదలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలు, పల్లెల నుంచి పట్టణాల వరకు ఏక కాలంలో అమలు చేయడంతో కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతోందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని చెముడలంకలో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. గత వైసీపీ పాలనలో అనుభవించిన నరకపాలన నుంచి బయటపడి ఏడాది గడచిన సందర్భంగా ప్రజలు ఎంతో సంతోషిస్తున్నారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరించారు. వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటమాని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షుడు ఈదల సత్తిబాబు, కొత్తపల్లి రాంబాబు, గంగుళ్ల రాంబాబు, నాగిరెడ్డి వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: మండలంలోని ముమ్మిడివర్పాడులో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.



ముమ్మిడివర్పాడులో కరపత్రాలు అందజేస్తున్న రామకృష్ణ

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

పీజీఆర్ఎస్‌లో ట్రాన్స్‌కో ఎస్ఈ రాజేశ్వరి.. వినతులతో పోటెత్తిన వినియోగదారులు

ఆలమూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ లోవోల్టేజీ సమస్యలతో పాటు దీర్ఘకాలంగా ఉన్న పలు సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఏపీ ఈపీడీసీఎస్ అమలాపురం సూపరింటెండెంట్ బి.రాజేశ్వరి చెప్పారు. ఆలమూరు ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి ఆమె విచ్చేసి వినతులు స్వీకరించారు. ప్రతీ గ్రామంలోను విద్యుత్ లోవోల్టేజీ సమస్యలు ఉన్నట్టు వినతుల ఆధారంగా గుర్తించారు. ఏళ్ల తరబడి సమస్యలను తెలియజేస్తున్నప్పటికీ ఫలితం కనిపించడం లేదని వినియోగదారులు ఫిర్యాదులు చేశారు. సమస్యలపై తాను పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకుని దశలవారీగా వాటిని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని ఆమె వివరించారు. పలు గ్రామాల నుంచి లోవోల్టేజీ, విద్యుత్‌స్తంభాలు, ల ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు తదితర సమస్యలపై 27 ఫిర్యాదు అందాయని, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు, డీఈ శ్రీధర్, ఏఈ దుర్గాప్రసాద్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వైసీపీకి మాజీ జడ్పీటీసీ రాజీనామా

ద్రాక్షారామ, జూలై 4(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఇంత సంతోషం వైసీపీకి రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను, తన భార్య ఉందూరు సర్పంచ్‌లుగా పనిచేశామని, వైస్ ఎంపీపీగా, జడ్పీటీసీ తాను పనిచేశానన్నారు. గత స్థానిక ఎన్నికల్లో తన కోడలు ఎంపీటీసీగా వైసీపీ తరఫున గెలుపొందిందని, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు ఆమెకు ఎంపీపీ అవకాశం ఇస్తానని హామీ ఇచ్చి నిలుపుకోలేదన్నారు. ఈ విషయాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగకపోవడంతో వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. అందరితో సంప్రదించి ఏ పార్టీలో చేరాలో నిర్ణయించుకుంటానన్నారు.

గ్రామాభివృద్ధికి సమష్టి కృషి

రావులపాలెం, జూలై 4(ఆంధ్రజ్యోతి): రావులపాలెం గ్రామాభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషిచేయాలని జడ్పీటీసీ కుడపూడి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ తాడేపల్లి నాగమణి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభకు ఆయన విచ్చేసి మాట్లాడారు. కుక్కల బెడద ఎక్కువైందని పలువురు సభ దృష్టికి తీసుకుని రాగా డాక్టర్ ఉమామహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని కార్యదర్శి దుర్గాప్రసాద్ చెప్పారు. ఉపసర్పంచ్ జి.మునిరెడ్డి, ఎంపీటీసీ గూటం త్రిమూర్తులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన

రావులపాలెం, జూలై 4(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ సెక్రటరీ జీపీ రావు, ప్రెసిడెంట్ ఎల్ఎస్ రావు ఆధ్వర్యంలో మొదటి ట్రిప్ ప్రారంభయ్యే సమయం నుంచి ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. అలాగే భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు.

అల్లూరి.. స్ఫూర్తి ప్రదాత

» ఘనంగా మన్యం వీరుడి జయంతి
» నివాళులర్పించిన పలువురు నాయకులు, అధికారులు



వాడపాలెంలో అల్లూరి విగ్రహానికి నివాళులుర్పిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జూలై 4(ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయం తి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఆత్రేయపురంలోని అల్లూరి పార్క్‌లో సీతారామరాజు విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పూలమాలలు వేసి నివాళులుర్పించారు. అలాగే రావిచెట్టు సెంటర్‌లో మన్యం వీరుడి విగ్రహానికి క్షత్రియ నాయకులు నివాళులర్పించారు. స్థానిక మహాత్మాగాంధీ విద్యాసంస్థల్లో కరస్పాండెంట్ పీఎస్ రాజు ఆధ్వర్యంలో అల్లూరి జయంతి జరిపారు.మండల పరిషత్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి ఎంపీడీవో వెంకటరామన్, సచివాలయ ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది నివాళులర్పించారు.

కొత్తపేట: స్థానిక వా డపాలెం వంతెన సెంటర్లో ని అల్లూరి విగ్రహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం పూలమాలలతో నివాళులుర్పించారు. స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరి చిత్రపటానికి ప్రిన్సిపాల్ కేవీ రాజు, పలివెలలో అల్లూరి విగ్రహానికి అల్లూరి సేవా సంస్థ అధ్యక్షుడు దుళ్ల వెంకటేశ్వర్లు పూలమాలలతో నివాళులుర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు, పెదపూడి బాపిరాజు, ఉద్దరాజు ప్రసాదరాజు, కోటిపల్లి సుబ్రహ్మణ్యం, అన్యం సత్యనారాయణ పాల్గొన్నారు.

రావులపాలెం: రావులపాలెం జడ్పీ పాఠశాల ఆవరణలో ఉన్న అల్లూరి విగ్రహానికి అల్లూరి సీతారామరాజు జాతీయ సేవా సంస్థ ఆధ్వర్యం లో పూలమాలలు వేసి నివాళులుర్పించారు. సంస్థ ఉపాధ్యక్షుడు పోతంశెట్టి కనికిరెడ్డి, దుళ్ల వెంకటేశ్వర్లు, పాఠశాల కమిటీ ఛైర్మన్ ఎన్‌వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా చిన్నబ్బులు

ఆత్రేయపురం, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం డిప్యూటీ ఎంపీడీవోగా డి.చిన్నబ్బులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల నుంచి బదలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటరామన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.